

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 07 హైదరాబాద్ 2015 నవంబర్ పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# 47వ అమరతిధి

అవతారుని 47వ అమరతిధి రెండున్నర రోజులపాటు 2016 జనవరి 30 ఉదయం 8 గంటల నుండి ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. కాగా, 2016 జనవరి 31వ తేదీ అత్యంత ప్రధానమైన రోజు. ఆ రోజున అవతార్ మెహెర్‌బాబా సమాధి ఎదురుగా మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకు బాబా ప్రేమికులందరూ మౌనం పాటించే సమయమని ప్రత్యేకంగా గుర్తించాలి.

## వసతి సదుపాయం

మెహెరాబాద్‌లో వసతి సౌకర్యం కోరుకునే యాత్రికులు ఒక్కొక్కరికి రూ. 50/- చొప్పున నగదును "అమరతిధి డొనేషన్స్" పేరిట పోస్టల్ మనీ ఆర్డరు లేదా బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మెహెర్‌బాబా ట్రస్టు అడ్రస్సు – 'అమరతిధి డొనేషన్స్", అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర – 414 001 పంపాలి. ఇందుకు ఆఖరు తేది 2016 జనవరి 7. ఏడు సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి సొమ్ము వసూలు చేయరు. ఎలక్ట్రానిక్ మనీఆర్డర్ ద్వారా మీరు "అమరతిధి డొనేషన్స్" పంపుతున్న ఎడల మీ పేరు ప్రక్కనే ఎంత మంది పురుషులు / స్త్రీలు తెలియచేయాలని కోరుతున్నారు. ముందుగా నగదు పంపలేని పక్షంలో 2016 జనవరి 30, 31 తేదీల్లో దిగువ మెహెరాబాద్‌లోని విచారణ కౌంటర్ల వద్ద ఒక్కొక్కరికి రూ. 100/- చొప్పున చెల్లించవలసి ఉంటుందని ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**పరుపులు:** పరుపుల కాంట్రాక్టరు రెండు రోజుల బసకు ఒక్కొక్క పరుపుకు రూ.50/- చొప్పున అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకోసం ముందుగా –శ్రీమతి ఉషా.అశోక్ సేఠ్, బంగ్లా నెం. 93, ఉషాకాల్, ఆనంద్‌నగర్, గుల్‌మొహర్ రోడ్, సావేడి, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర – 414 003 కు తగిన నగదును మనీ ఆర్డర్ ద్వారా పంపవలెను.

భజనలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించదల్చుకునేవారు, శ్రీ మెహెర్‌నాథ్ బి.కల్చురీ, ట్రస్టీ, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర – 414 001, అనే చిరునామాకు 2015 డిసెంబరు 31వ తేదీ లోగా తెలియజేయాల్సిందిగా కోరుతున్నారు.

**అమరతిధికి వెళ్ళడానికి, అవతారుని ఆశీశ్శులు అందుకోవడానికి నేటి నుండే సిద్ధంకండి!**

## బాబా సందేశం

నిరంతరం భగవంతుని ధ్యాసలో వుండేవారు ,
ప్రాపంచిక విషయాలకు, వారుగన్న మధురమైన కలకంటే
తక్కువ ప్రాధాన్యత ఇస్తారు.

**To one who intensely longs for God,**
**the importance of the world is less than the importance of a dream.**
**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-6555 3218**
**malladisukku@gmail.com**

*వ్యవస్థాపకులు:*
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. హిందీ సహవాస్ 6-12
3. మనోనాశ్ వార్షికోత్సవం 13-14
4. మా మాటలు 15-17
5. బాబా సర్వజ్ఞుడు 18
6. బీమ్లీ రజతోత్సవాలు 19
7. లార్డ్ మెహెర్ 20-27
8. జీన్ అడ్రియల్ 28-35
9. జీవిత సత్యాలు 2002 మే నుండి 36-37
10. ప్రార్థనలు 38-39

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# ఆంధ్రా రెస్టుహౌస్

మెహెరాబాద్‌లో బాబావారి అమరతిథికి 2016 జనవరి 30, 31 ఫిబ్రవరి 1వ తేదీలలో హాజరయ్యే బాబా ప్రేమికులకు ఆంధ్రా రెస్టుహౌసు సాదర స్వాగతం పలుకుతోంది. కాగా, అమరతిథికి హాజరుకాగోరు బాబా ప్రేమికులు ఆంధ్రా రెస్టుహౌసులో భోజన / వసతి సౌకర్యాలు కోరువారు తమ వివరాలు 2015 డిశంబరు 31లోగా పంపి ముందుగా రిజర్వు చేసుకోవల్సిందిగా కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ (0241-2548544/ 99-12-199978) కోరుతున్నారు.

# పూరీ,రాంచీ,కోల్‌కత్తాలకు

మెహెర్‌బాబా 1916 నుండి 1950వ దశకం దాకా ఒరిస్సాలోని పూరీ, జార్కంఢ్ రాష్ట్రంలోని రాంచి, కోల్‌కత్తా నగరాలను అనేకమార్లు సందర్శించారు. ఆయా నగరాలలో బాబా మస్తులతో తన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. బాబావారి పాదస్పర్శతో పునీతమైన **ఈ నగరాలను, 2016 ఫిబ్రవరి 11 నుండి 14 దాకా నాల్గు రోజులపాటు పర్యటించాలని, ఆయా ప్రాంతాలలో మెహెర్ ప్రేమిక సహవాస్‌లో ఆనాటి సంగతులు స్మరించుకోవాలని ఒక ప్రత్యేక యాత్ర ఏర్పాటు చేసినట్లు డా. నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.** ఈ యాత్రలో సుమారు 150 మందికి మాత్రం భోజన, బస ఏర్పాటు చేయగల అవకాశం తమకు వుందని, కాబట్టి ఎవరు ముందువస్తే వారి పేర్లు, 150 మందికి మాత్రం లోబడి నమోదు చేసుకోవాలని నిర్ణయించినట్లు డాక్టర్ ప్రసాద్ **(94 40 602754)**తెలిపారు. ఈ యాత్రలో భోజన, బస ఏర్పాటు కయ్యే ఖర్చు నమోదు చేసుకున్న సభ్యులకు విడిగా తెలియజేస్తామన్నారు. రైలు రిజర్వేషన్లు ఎవరికివారుగా చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాల కోసం శ్రీ సత్తయ్య (92475 83467), హైదరాబాద్ సంప్రదించగలరు.

# హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.**

*సంపాదకీయం*

# సేవాధర్మం

అవతారుని అమరతిథి 2016 జనవరి 31న జరుగనుంది. అవతారుని జన్మదినోత్సవం 2016 ఫిబ్రవరి 25న జరుపుకుంటున్నాం. బాబా ప్రేమికులు చాలామంది అమరతిథికి మెహెరాబాద్‌కు వెళ్ళడానికి తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. అలాగే, అవతారుని జన్మదిన వేడుకలను నవంబరు నుండే మెదలుపెట్టారు.

ఈ సందర్భంగా బాబా ప్రేమికులందరికీ మెహెర్‌బాబా పత్రిక ద్వారా, అందరికీ తెలిసినదే ఐనప్పటికీ రెండు విషయాలను తిరిగి గుర్తుచేయాలనుకుంటున్నాం.

**1)** మెహెర్‌బాబా భౌతిక దేహం 1969 జనవరి 31, మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వదిలిపెట్టారు. మెహెర్ ప్రేమికులందరికీ ఆ క్షణాలు చాలా పవిత్రమైనవి. మెహెరాబాద్‌లో, అలాగే, తెలుగునాట గల పలు బాబా కేంద్రాలలో బాబా ప్రేమికులందరూ 2016 జనవరి 31, మధ్యాహ్నం 12 నుండి 12.15 దాకా మౌనంగా బాబా నామస్మరణ పాటిస్తారు. అమరతిథి కోసం మెహెరాబాద్ దాకా వెళ్ళలేనివారు స్థానికంగా గల బాబా సెంటర్లలో లేదా వారు ఏ ప్రాంతంలో వున్నా ఆ రోజున, ఆ పదిహేను నిముషాలు మౌనంగా బాబా నామస్మరణలో గడపాలనుకోవడం ముదావహం. ఈ విషయాన్ని తమ బంధుమిత్రులందరికీ తెలియజేయాలని మా మనవి.

***

**2)** అలాగే, 2016 ఫిబ్రవరి 25 దాకా ప్రతి రోజూ నిర్వహించే బాబావారి సత్సంగ్ కార్యక్రమాల ఏర్పాటుతోపాటు బాబావారి సందేశాలను అనుసరించి వీలైనంత మేరకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి.

రాష్ట్రంలో చలి తీవ్రత రాబోయే డిశంబరు, జనవరి నెలలలో అధికంగా వుంటుంది. ఫుట్‌పాత్‌లపై పడుకునే అనేకమంది అన్నార్తులకు చలిని తట్టుకోగల దుస్తులనేమైనా అందించి సహాయపడాల్సింది. బాబావారి జన్మదిన వేడుకలలో వీలైనంత మంది పేదవారికి సహాయపడే ప్రణాళికలు సంబంధిత కార్యకర్తలు రూపొందించుకుంటారని ఆశిద్దాం!!

***

# హిందీ సహవాస్

(గత సంచిక ప్రారంభం)

**మెహెర్‌బాద్, 1955 నవంబరు:**

గత రెండు సహవాస్‌లలో ప్రస్తావించినట్లుగా,
ఏడు రోజులపాటు ఉపవాసం స్వచ్ఛందంగా చేపట్టడానికి ఎవరైనా వుంటే లేచి
నిలబడమన్నారు. ఇందుకు చాలామంది సిద్ధపడ్డారు.
హమీర్‌పూర్ ప్రేమికుడైన పుకార్‌జీ కేసి బాబా చూస్తూ,
హా! నీవు లావుగా, ధృఢంగా వున్నావ్!! నిన్ను ఎంపిక చేశేశానన్నారు.
మరో ప్రేమికుడు హకూమత్ రాయ్ కేసి చూసి, నీవూ బలంగా, ధృఢంగా వున్నావ్!!
నీవూ ఎంపికయ్యావ్ అని ప్రకటించారు.
డెహ్రాడూన్ నుంచి వచ్చిన వీరేందర్ సింగ్‌నీ ఎంపిక చేసినట్లు బాబా ప్రకటించారు.
అలాగే రాందాస్, కుంజ్ బెహరాయలనూ ఎంపిక చేశారు.
ఇలా హిందీ సహవాసీలలో నుండి ఐదుగురిని ఏడు రోజులపాటు
ఉపవాసం వుండేందుకు బాబా ఎంపిక చేశారు.
వీరందరూ 1956 ఫిబ్రవరి 15 నుండి ఏడు రోజులపాటు
కేవలం మంచినీరు త్రాగుతూ కఠిన ఉపవాసం వుండాలి.
మిగిలినవారు, ఎంపిక చేయబడనివారు చింతించ వద్దన్నారు.
మీ అంగీకారం తెలియజేశారు కాబట్టి,
మీరు ఉపవాసం వున్నదాంతో సమానం అన్నారు.
ఈ ఎంపిక చేసిన ఐదుగురితో బాబా మాట్లాడుతూ,
మీ అందరికీ తగిన సూచనలు రేపటి రోజున చెప్తానన్నారు.
ఉపవాసం పూర్తికాగానే, మీరు ఆధ్యాత్మిక పథంలో ముందంజలో
ఉన్నట్లు భావించవద్దన్నారు. ఆంధ్రాలో ఒకసారి ఒక వ్యక్తిని
నేను 40 రోజులు ఉపవాసం వుండమన్నాను.
40 రోజుల తర్వాత ఏవో కొన్ని అనుభూతులు అతనికి కల్గాయి.
దాంతో స్థానికుల చేత దండలు వేయించుకుని,
కాళ్ళకు దణ్ణాలు పెట్టించుకుని నానా హంగామా చేశాడతను.
ఇది మంచిది కాదని హెచ్చరించారు.
ఉపవాసం చేయడం వల్ల భగవంతుని ప్రేమ పొందలేరు.

నేను ప్రత్యేకంగా చెబితేనే ఉపవాసం పాటించండి.
మీ అంతట మీరు ఉపవాసం వుండాలనుకుంటే, కడుపునిండా తిని,
ఆపై మీ మనస్సును నియంత్రించండి.
మనస్సుకు ఉపవాసం ముఖ్యం అని గుర్తించండని బాబా అన్నారు.
తిరిగి, ప్రేమ కానుక గురించి ప్రస్తావిస్తూ
ప్రేమ – త్యాగాన్ని కోరుతుంది. ప్రేమకు ప్రతిఫలాపేక్ష ఉండదన్నారు.
ఫిబ్రవరి 15 నుండి ఏడాదిపాటు మీరు చేపట్టబోయే బాబా నామస్మరణ గురించి చెబుతూ, తొలిరోజున అర్ధరాత్రి “బాబా–బాబా” అని 14 సార్లు స్మరించమన్నారు.
ఆ మర్నాడు తిరిగి అర్ధరాత్రి సమయంలో 28 సార్లు జపించాలన్నారు.
ఆ మాదిరిగా ఒకరోజున 14 సార్లు, ఆ మర్నాడు 28 సార్లు,
తిరిగి 14, ఇలా రోజు తర్వాత రోజున 14 – 28 సార్లు –
తక్కువ ఎక్కువా – కాకుండా, క్రమం తప్పకుండా అర్ధరాత్రి 12 గంటలకు ఠంచనుగా స్మరించమని ఆదేశించారు. ఆ సమయంలో ఎలాంటి ఆలోచనలు మనస్సులోకి రాకుండా జాగ్రత్తపడమన్నారు. ఇది కష్టమే.
కానీ, అసాధ్యం ఏమాత్రం కాదన్నారు.
మండలి సభ్యుడు భావూకి మాత్రం ఇది అసాధ్యం అన్నారు.
ఇది అతని తరం కాదన్నారు.
ఎందుకంటే, మంచి గాఢనిద్రలో కూడా **బాబా–బాబా** అని స్మరించడం అతని అలవాటన్నారు. ఈ కష్టమైన కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యేవారు గుర్తుంచుకోవల్సిందేమంటే అంటూ బాబా ఇలా చెప్పారు.
ఆ అర్ధరాత్రి సమయంలో తప్పించి, మిగిలిన సమయంలో ఎన్నడూ
బాబా నామం మీ పెదిమలు దాటి బయటకు రాకూడదన్నారు.
మీ ఆలోచనల్లో నన్ను జ్ఞాపకం ఉంచుకోవాలన్నారు.
ప్రేమ గురించి మాటల్లో వర్ణించలేం!!
ప్రేమను అనుభవించితే కానీ దాని మధురం, అందం, అర్థం కాదు.
నన్ను ప్రేమించలేరని మీరు అనుకోవద్దు!!
ఒకవేళ ఒకరోజు అర్ధరాత్రి నా నామం స్మరించడం మరచిపోతే బాధపడొద్దు.
ఆ మర్నాడు కొనసాగించండి!!
అది కూడా సాధ్యం కాకపోతే, ప్రతిరోజూ రాత్రి నిద్రపోయేముందు,
తిరిగి తెల్లవారాక మెలుకువ వచ్చాక నన్ను జ్ఞప్తికుంచుకోండి.
నా నామం స్మరించండి. మీ మంచీ – చెడు ఆలోచనలు,
పనులు అన్నీ నాకు అప్పజెప్పండి.

ఇలా చేసేముందు, అంతా బాబా దయ.
బాబాకే సర్వం సమర్పిస్తున్నాం అని భావించండి.
మనస్సు, దాని కుప్పిగంతులు గురించి నేను భగద్వచనంలో చాలా స్పష్టంగా చెప్పాను.
భగవంతుడు ఒక్కడే ఉన్నాడు. భగవంతుడు ఒక్కడే సత్యం!!
మిగిలినదంతా మిధ్య!! మిగిలినదంతా శూన్యం!! అవాస్తవం!!
అలాంటప్పుడు – 'మంచీ – చెడూ' – అనే బేధమే లేదని గమనించమన్నారు.
భగవంతుడు అన్నింటా, అందరిలో వున్నాడు.
నీలోనూ వున్నాడు. భగవంతుడు సర్వరక్షకుడు.
గొప్ప దయగలవాడు. భగవంతునికి తెలియనిదంటూ ఏమీలేదు.
నీ ఆలోచనలన్నీ ఆయనికి తెలుసు. ఇప్పుడే కాదు,
మరో ఏభై సంవత్సరాల తర్వాత నీవు ఏం ఆలోచిస్తావ్?
అనే సంగతి కూడా భగవంతుడికి తెలుసు.
మరి ఆయన అంత శక్తిమంతుడు కదా! సర్వశక్తిమాన్ కదా!!
అలాంటప్పుడు, నీలో వచ్చే ఆలోచనలకి ఆయన అడ్డుకోవచ్చు కదా?
నీ మనస్సులోకి ఆలోచనలే రాకుండా చేయడానికి,
ఆయన్ని ఎదురొడ్డే వారు మాత్రం ఎవరున్నారు?
నిశ్చింతంగా, ఒక్క క్షణం నిర్మలంగా ఆలోచిస్తే,
మంచి–చెడూ, ఈ రెండూ భగవంతుడే
నీచేత చేయిస్తున్నాడని నీకర్ధమవుతుంది!!
ఈ విషయాన్ని మరింత జటిలం కాకుండా, ఇక ఇంతటితో ఆపివేసి,
నేను చెప్పినట్లు ఒక పని చేయండి.
మీరూ, మీ కుటుంబం, కుటుంబపరమైన అన్ని బాధ్యతలు నిర్వహించండి.
ఐతే, దేనికీ బానిసలు కావొద్దు. మీ నిత్యకృత్యాలన్నీ చేసుకుంటూనే,
నా నామస్మరణ సాధ్యమైనంత మేరకు ఎక్కువసార్లు తలచుకోండి.
తద్వారా, ఈ మాయలో మీరు చిక్కుకోరని బాబా సలహా ఇచ్చారు.
ఇదిగో!! ఇటు చూడండి!! నేను చెబుతున్న మాటలు శ్రద్ధగా ఆలకించండి!!
మీరు ఇది మంచిది – అది చెడు అనే బేధం లేదని గమనించండి!!
మీరు మంచివాళ్ళు, వాళ్ళు – మంచివాళ్ళు కాదని,
ఐనా – మీ అంత మంచి కాదనీ, వారంతా చెడ్డవారనీ, దుర్మార్గులనీ భావించ
వద్దన్నారు. ఈ వ్యత్యాసమే శుద్ధ దండగ అన్నారు బాబా.
నిన్ను ఎవరైనా దూషించినా, అవమానపరిచినా, దుర్భాషలాడినా, బాధపడొద్దన్నారు.
ఆ సమయంలో బాబాను తలుచుకోమన్నారు.

ఇతరులు సుఖంగా వుంటే సంతోషించండి.
వారు బాధల్లో వుంటే, సహాయపడమని, తగిన, తోచిన సహాయం అందించమని బాబా సూచించారు. ఇది బాబాకి ఎంతో ఇష్టం అన్నారు.
భగవంతునికిదే ప్రీతి అన్నారు. ఒకవేళ నీకు కోపం వస్తేనో?
ఆ కోపాన్ని ఎవరిపైనా ప్రదర్శించే ప్రయత్నం మానుకోమన్నారు.
ఒకవేళ నీవు మంచివాడివి, ఉత్తముడివి, సంస్కారవంతుడివి,
నిజాయితీపరుడివి – ఇలా నీలోని సద్గుణాల పరంపర గురించి
నీకు నీవుగా గర్వపడుతూ,
ఆవలవాళ్ళు – దుర్మార్గులుగా, దుష్టులుగా నీవు భావిస్తుంటే,
వాళ్ళూ, నీలాగా మంచి ప్రవర్తనతో నడుచుకునేందుకు ప్రయత్నించమన్నారు.
ప్రేమతో సుమీ!! అని బాబా హెచ్చరించారు.
నీవు ధనికుడివయితే, పేదవాళ్ళకి అర్థికంగా సహాయపడటానికి ప్రయత్నించమన్నారు.
నీ బిడ్డ అనారోగ్యంతో బాధపడుతుంటే నీవెలా చలించిపోతావో,
అదేమాదిరిగా మరొకరి బిడ్డ కష్టాల్లో వున్నప్పుడు ఆదుకోమన్నారు.
సమాజంలో అందరితో ఆనందంగా వుండు,
నేను అందరిలో సమానంగా వున్నానని బాబా ప్రకటించారు.
మహాత్ములు, సాధు సజ్జనులు, ఆధ్యాత్మిక గురువులు దగ్గరకు తన ప్రేమికులు వెళ్ళడం గురించి బాబా ప్రస్తావించారు. ఈ విషయమై బాబా ఇలా అన్నారు.
నీవు నిజంగా మహాత్ములు, సత్పురుషులు దగ్గరకు వెళ్ళి ప్రణమిల్లుతానంటే నాకేమీ అభ్యంతరం లేదు. ఐతే, అదే పనిగా మాత్రం వెళ్ళొద్దని బాబా అన్నారు.
నేను ప్రతి ఒక్కనిలో, ప్రతి చోట వున్నాను. అలాంటప్పుడు అలాంటి మహాత్ముల దగ్గరకు వెళ్ళడంలో తప్పేముందన్నారు. నీకన్నా పెద్దవాళ్ళని తప్పక గౌరవించాలి.
మీరిష్టపడితే మహాత్ముల్ని తప్పక సందర్శించవచ్చు.
ఐతే, మీ అవసరార్థం, వారి దరికి వెళ్ళవల్సిన పన్లేదని బాబా స్పష్టం చేశారు.
డాక్టర్ సి.డి. దేశ్‌ముఖ్‌ని (నాగపూర్) చూపిస్తూ,
ఇతను బాగా చదువుకున్నాడు. నా ప్రేమికుడు కూడా.
నేను మస్తుల దగ్గరకు వెళ్ళడం, నేను వారి కాళ్ళకు మొక్కడం ఇతరత్రా చూసి,
అతను కూడా అదే పని చేయడం మొదలెట్టాడు.
ఇది ఎంతవరకు వెళ్ళిందంటే ఒక మస్తును తన ఇంటికి తీసుకెళ్ళి,
నిత్యం అతని సేవలకు అంకితమయ్యేంతవరకూ కొనసాగింది.
దీంతో దేశ్‌ముఖ్ – అతని భార్యల నడుమ గొడవలు వచ్చాయి.
అతని భార్య ఆశ్చర్యపడింది. బాబా చెప్పింది ఏమిటి?

భర్త చేస్తున్న తీరు చూసి ఆశ్చర్యపడింది.
ఇది నాకు తెలిసి వారిద్దరినీ నా దగ్గరకు పిలిపించాను.
వినోదం కోసం ఏదో సినిమాకో, నాటకానికో వెళ్ళినట్లు సాధుసంజ్ఞన సత్పురుషులు,
మహాత్ములు దగ్గరకు ఎప్పుడైనా ఒక(రెండుసార్లు వెళ్ళొచ్చు.
కానీ, ఆధ్యాత్మికంగా ఉన్నతిని ఆశించి వెళ్ళేట్లయితే,
దాంతో నాకు సంబంధం లేదని చెప్పాను.
భగవత్ సాక్షాత్కారం పొందాలనుకుంటే మాత్రం కడదాకా
నా కొంగును విడువరాదని గట్టిగా హెచ్చరించాను.
ఇందులో మరొక అంశానికి చోటులేదని గట్టిగా చెప్తున్నానని బాబా అన్నారు.
ఇంతలో మరొక సహవాసీ ఏమన్నాడంటే –
బాబా – నేను మోతీ బాబా దగ్గరకి తరచు వెళ్తున్నాను.
బహుశా నీవు ఎప్పుడైనా మెహెరాబాద్‌కు రమ్మనమన్న సమయంలోనే
మోతీబాబా తన దగ్గరకు రమ్మనమని కబురుచేస్తే,
నేనేం చేయ్యాలని? అడిగాడు!!
నీవు అతని ఆశ్రమంలో వుంటే కొన్ని సమస్యలు తలెత్తుతాయి.
అందుకే నా మండలివారిని, నేను లేకుండా – ఎక్కడికీ వెళ్ళొద్దని ఆదేశించాను.
ఒక ఉదాహరణగా చెబుతూ
నా మండలివారిని ఉపవాసం వుండమని నేను ఆదేశించాననుకోండి.
ఐతే ఈ మండలిలో ఎవరైనా ఒకరు ఒక మహాత్ముని దగ్గరకు వెళ్ళితే,
ఏదో ఆయన హుషారుగా ఉన్న సమయంలో,
ఈ మండలి సభ్యుడిని తనతోపాటు కడుపారా భోజనం చేయమని పిలిస్తే,
అప్పుడు ఈ మండలి సభ్యుని పరిస్థితి ఎలా వుంటుంది? అని ప్రశ్నించారు.
అడకత్తెరలో పోక చెక్కలా ఉండదూ??అన్నారు.
అతనితో కలిసి భోజనం చేయడం వల్ల నా ఆదేశాలను ఉల్లంఘించిన
వాడవుతాడు కదా?? అదే ఆ సాధువు మాట వినకపోతే,
ఆయన్ను అవమానపరిచినట్లౌతుంది. ఇలాంటి సమయంలో
నా ఆదేశాలు జవదాటకుండా సాధువుని తృప్తిపరచాల్సిన అవసరం
తలెత్తుతుంది. కాబట్టి, ఆ సహవాసీకి జవాబుగా బాబా ఇలా చెప్పారు.
మోతీబాబా కబురు పంపితే, నా గురువాజ్ఞ ప్రకారం నీవు మరెక్కడకో
వెళ్ళవల్సివచ్చిందని నిర్మొహమాటంగా నిజాయితీగా చెప్పమన్నారు.
నేను ఈ విశ్వానికే ప్రభువును. గుర్తుంచుకోండి బాగా తిరిగి హెచ్చరించారు.
ఈ సందర్భంలోనే బాబా సూచనల మేరకు, గతంలో జరిగిన ఒక సంఘటనను

బాబా మండలి సభ్యుడైన ఏరుచ్ ఇలా చెప్పాడు.
ఆ సమయంలో వారంతా నాసిక్‌లో బాబాతోపాటు వున్నారు.
మండలివారందరినీ ఒకరోజు ఉపవాసం వుండమన్నారు.
ఆరోజుననే ఒక ముస్లిం సాధువు,
మండలి సభ్యుడొకడి చేతిలో తన ప్రసాదంగా ఏదో పెట్టి, తినమని ఒత్తిడి చేశాడు.
ఆ మండలి సభ్యుడు సాధువు ఇచ్చిన ప్రసాదం కదా అని చెప్పి నోట్లో వేసుకున్నాడు.
బాబాకు ఈ విషయం తెలిసింది. దాంతో ఆయనకు చాలా కోపం వచ్చింది.
ఆ తర్వాత మండలి సభ్యుడిని పిలిచి - గట్టిగా హెచ్చరిస్తూ -
ఇలా ఎవరైనా సాధువులు, తమ ప్రసాదంగా ఏదైనా ఇస్తే దాన్ని తీసుకోండి!!
కానీ, తినొద్దన్నారు. ఇలా ఏరుచ్ ఆనాటి సంఘటనను క్లుప్తంగా వివరించాడు.
ఇలాంటి విషయాల్లో మీరు చాలా జాగ్రత్తగా ఉండమని బాబా సహవాసీలను
హెచ్చరించారు. మీరు నా పరిధిలో వుండదల్చితే,
ఆధ్యాత్మికంగా వారెంత ఉన్నతులైనా వారి దగ్గరకు వెళ్ళేటప్పుడు చాలా జాగ్రత్తగా
ఉండాలి సుమీ!! అని సూచించారు. అనంతరం కొంతసేపు విశ్రాంతి తీసుకోండన్నారు.
సహవాసీలు భజన గీతాలు ఆలాపించారు.
ఛలోక్తులతో సమావేశమందిరం కొంతసేపు నవ్వులతో నిండింది.
మధ్యాహ్న భోజనానంతరం తిరిగి భజన గీతాలు, చలోక్తులు నడిచాయి.
సాయంత్రం 3:50 నిముషాల సమయంలో సహవాసీలనందర్నీ
తనతోపాటు ఆరంగాం గ్రామానికి తీసుకెళ్ళారు.
ఆ రోజున గ్రామస్థులు గ్రామంలో పెద్ద కార్యక్రమం ఏర్పాటుచేసి
బాబావారిని ఆహ్వానించారు. నడవలేని వాళ్ళు, కాస్తంత అనారోగ్యంతో
వున్న సహవాసీలను బాబా కార్యదర్శి మరియు శిష్యుడైన
ఆదీ-కె-ఇరానీ కారులో తీసుకెళ్ళాడు. మిగిలిన వారందరూ బాబాతో కలిసి కాలినడకన
వెళ్ళారు. ముందుగా బాబా "బువాజీ బువా" ఆలయాన్ని దర్శించారు.
బువాజీ బువా హిందూ సద్గురువు. సుమారు 400 సంవత్సరాల క్రితం
సమాధి అయ్యాడు. ఆ ఆలయాన్ని **'దఖ్ఖ పందర్‌పూర్'** అని పిలుస్తారు.
అంటే చిన్న తిరుపతి లాగా - చిన్న పండరిపూర్ అని అర్థం.
బాబా రాక కోసం ఎందరో స్థానిక స్త్రీలు - పురుషులు పూల దండలు - ఆరతులు
చేతబట్టుకుని ఎదురుచూస్తున్నారు. బాబావారిని చూస్తూనే ఆరతి పట్టారు.
పూలదండలు వేశారు. బాబా పాదాలు తాకడం నిషిద్ధం అయినప్పటికీ,
ఒక్కొక్కరూ వచ్చి వరుసలో పాదాభివందనం చేశారు.
బాబావారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆరంగాం ప్రజలు పేదవారు.

ఐనా, నా ఎడల వారి ప్రేమ చాలా గొప్పది అన్నారు.
ఈ రోజు స్థానికంగా వున్న తన ప్రేమికుల ఇండ్లను సందర్శిస్తానన్నారు.
ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.
పెద్ద ఊరేగింపు ముందుకు సాగుతుంటే
ఒక్కొక్కరి ప్రేమికుల ఇళ్ళను బాబా సందర్శించారు.
గ్రామస్థులు సంతోషంతో నృత్యం చేశారు.
పెద్ద ఎత్తున బాజా బజంత్రీలు మ్రోగించారు.
ప్రతి ఇంట్లోనూ బాబాకు ఆరతి పట్టారు.
మెడలో పూల దండలు వేశారు.
చిన్న చిన్న గుడిసెల్లాంటి ఇళ్ళలో కూడా
బాబా నవ్వుతూ కొన్ని క్షణాలపాటు కూర్చున్నారు.
వారికి ఆలింగనం ఇచ్చారు.
వారిలో చాలామంది 1927 ప్రాంతంలో మెహెరాబాద్‌లో నిర్వహించిన
హజ్రత్ బాబాజాన్ స్కూల్లో చదువుకున్నవారున్నారు.
వారి పిల్లలతో బాబా నవ్వుతూ మాట్లాడుతూ ఆనాటి సంగతులు గుర్తుచేశారు.
ఆ తర్వాత ఆరంగాం నుండి తన ప్రేమికుల ఇండ్లను సందర్శించారు.
వారిలో ముఖ్యంగా వాలూ, రాధా, భాగూ, జంగ్లే, ముక్తా ... ఇండ్లను సందర్శించారు.
ఆ ఇళ్ళలో వారి పిల్లలు బాబాకు ఆరతి పట్టారు.
మెహెరాబాద్‌లో గత కొన్ని రోజులుగా సహవాస్ జరుగుతోంది కదా -
అందుకని మెహెరాబాద్‌లో వుంటున్న మహ్మద్ మస్తు,
ఆలీషా మస్తులను ఫ్యామిలీ క్వార్టర్స్ దగ్గర వుంచారు.
బాబా ఈ మస్తులను కూడా కలిశారు.
ఆ సమయంలో మహ్మద్ మస్తు బాబా చేతిని గట్టిగా పట్టుకుని,
దాదా! ఇక్కడ్నుంచి సతారా వెళ్దాం అని మారాం చేశాడు.
మహ్మద్ మస్తు - ఏం పెట్టినా తినడం లేదని, పెండూ బాబాకు ఫిర్యాదు చేశాడు.
నేను బాగానే తింటున్నాను బాబా. పెండూ అబద్దాలు చెప్తున్నాడని,
మహ్మద్ మస్తు బాబాతో చెప్పాడు.
ఈ మాటలు విని బాబా గట్టిగా నవ్వుతూ, బాగా తినమని హెచ్చరిస్తూ,
మెహెరాబాద్ సహవాస్ ప్రాంగణానికి సాయంత్రం 5:30 కల్లా వచ్చారు.
ఆ తర్వాత సాయంత్రం 6 గంటల సమయంలో - జైబాబా - జయజయనాదాల
నడుమ, బాబా కారులో మెహెరాజాద్‌కు బయల్దేరి వెళ్ళారు.

**-సశేషం**

# ఖోజాగూడ మనోనాశ్ వార్షికోత్సవం

మెహెర్‌బాబా హైదరాబాద్‌లోని ఖోజాగూడ గుహలో 16.10.1951 నుండి 20.10.1951 వరకు మనోనాశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబా ఆ కార్యక్రమం నిర్వహించి నేటికి 64 సంవత్సరాలు పూర్తయ్యింది. గత దశాబ్దం పైగా ప్రతి ఏటా మనోనాశ్ వార్షికోత్సవాన్ని ఖోజాగూడాలో నిర్వహిస్తున్నారు. ఐతే ఈ ఏడాది వార్షికోత్సవానికి ఓ ప్రత్యేకత వుంది. ఖోజాగూడా మనోనాశ్ గుహని ఇప్పటికే బాబా ప్రేమికులు అందరూ చూసి వుంటారు. చిన్న ఎత్తైన కొండపైన వుంది. చుట్టూ ఎత్తైన కొండలున్నాయి. గతంలో ఈ కొండ పైభాగానికి చేరుకుని, బాబా వారు ఏకాంతవాసం వున్న గుహ ప్రాంతాన్ని చేరుకోవాలంటే, వయస్సు పైబడినవారికి వీలుండేది కాదు. సరైన రహదారి లేదు. చిన్నగా పడుతూ లేస్తూ అన్నట్లు చెట్టునో, రాయినో పట్టుకుని నింపాదిగా పైకి ఎక్కేవారు. మంచి వయస్సులో వున్నవారికి కూడా, కొండ పైభాగాన్ని చేరుకునే సరికి ముచ్చెమటలు పట్టేవి. నేడు ఆ పరిస్థితి లేదు. గతంలోని గతుకుల కొండ రోడ్డును వదిలి, ఒక చక్కని రహదారి నిర్మాణం చేశారు. దాదాపుగా కొండ గుహ దాకా కార్లు, స్కూటర్లు వెళ్ళేలా చక్కని రోడ్డు నిర్మించారు. కొండ పైభాగన కార్లు సుమారు నూరు కార్లు పార్కింగ్ చేయగల స్థలం ఏర్పాటు చేశారు. నడిచి వెళ్ళగల్గేవారు సునాయాసంగా ఓ ఐదు పది నిముషాలలో బాబావారి ఏకాంతవాస గుహను చేరుకోవచ్చు. ఈ రోడ్డును నిర్మించింది ప్రభుత్వం కాదు. బాబా ప్రేమికులు స్వయంగా నిర్మించారు. బాబా యువ కార్యకర్తలు శ్రమదానం చేసి నిర్మించారు. ఇందులో పాల్గొన ప్రతి యువతను, ముఖ్యంగా వారికి నాయకత్వం వహించిన శ్రీ పి. రాజేంద్ర మెహెర్‌ని తప్పక అభినందించాలి. మేం చాలామందిమి గత దశాబ్దం పైగా ఖోజాగూడా వెళ్తున్నాం. అనాటి నుండి నేటిదాకా ఇక్కడ వచ్చిన మార్పు అనూహ్యం. నేడు ప్రతి రోజూ ఖోజాగూడా వెళ్ళి రావచ్చు. ప్రతి రెండవ శనివారం సత్సంగ్ ఉ.8 గంటల నుండి 10 గంటల దాకా ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం యువత శ్రమదానం ఉ. 8 నుండి కొనసాగుతుంది. ఆసక్తిగల యువతకు స్వాగతం పలుకుతున్నారు.

ఈ 64వ మనోనాశ్ కార్యక్రమానికి మెహెరాబాద్ నుండి శ్రీధర్ కేల్కర్, ట్రస్ట్ చైర్మన్, జాల్ దస్తూర్ దంపతులు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ టి. హరీష్‌రావు విచ్చేశారు. శ్రీ ప్రతాప్ ఆహిర్, పూణే, శ్రీ గోపి బృందం భజన గీతాలు ఆలాపించారు. కుమారి మెహెర్ నిధి, కుమారి హరిణి, కుమారి మెహెర్ సంప్రీతి నృత్యం ప్రదర్శించారు.

శ్రీ షణ్ముఖం మిత్ర బృందం, భగవంతుడు – విశ్వాసం అనే అంశంపై లఘు నాటిక ప్రదర్శించారు. రాష్ట్ర మంత్రి శ్రీ టి. హరీష్‌రావు Everything & Nothing పుస్తకావిష్కరణ చేశారు. శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ బి. రామక్రిష్ణయ్య తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. ముందుగా రాష్ట్ర మంత్రి శ్రీ టి. హరీష్‌రావు, ఖోజాగూడా గుహ ప్రాంగణంలో బాబావారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం బాబా ప్రేమికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ... అందరికీ జైబాబా చెప్పారు. మెహెర్‌బాబా మనోనాశ్ కార్యక్రమానికి హైదరాబాద్‌ను ఎంపిక చేయటం ఈ నగర ప్రజల అదృష్టం అన్నారు. తాను కరీంనగర్ కాలేజీ విద్యార్థిగా ఉన్నరోజుల్లో తరచు బాబా కార్యక్రమాల్లో పాల్గొనేవాడినన్నారు. కరీంనగరు బాబా సెంటరు నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించానన్నారు. ఆ తర్వాత ఎన్నో సంవత్సరాలకు ఈనాడు బాబా ప్రేమికులనందర్నీ కలుసుకునే అదృష్టం కలిగిందన్నారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీ ప్రపంచంలో అశాంతికి కారణం మనస్సు. దాన్ని జయించాలంటే మెహెర్‌బాబాను నిత్యం స్మరిస్తేనే సాధ్యమౌతుందన్నారు. లేనిఎడల నిత్య అసమ్మతివాదులుగా మిగిలిపోతాం. ఎంతకాలం జీవించాం అనేది ముఖ్యం కాదు. ఎంత ఎక్కువగా ఇతరులు సేవచేయగల్గాం, వారిని ప్రేమించామన్నది ప్రధానం అన్నారు హరీష్‌రావు. ఖోజాగూడా బాబా కేంద్రం అభివృద్ధికి గౌరవ ముఖ్యమంత్రి గారితో మాట్లాడి ప్రభుత్వ సహాయం తప్పక అందించడానికి తనవంతుగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. బాబా ఇచ్ఛలేనిదే తన వద్దకు ఎవరూ రాలేరని బాబా అన్నారు. శ్రీ హరీష్ రావు బాబా ఇచ్ఛ మేరకు ఇక్కడకు రాగల్గారని శ్రీధర్ కేల్కర్ అన్నారు. ఖోజ్‌నా అంటే వెదకడం. గొప్ప భగవదన్వేషణా స్థలం ఖోజాగూడ అని బాబా ట్రస్టు సభ్యులు శ్రీ జాల్ దస్తూర్ చమత్కరించారు. భవిష్యత్తులో ఈ స్థలం సందర్శకులకు సరిపోనంతగా అభివృద్ధి చెందుతుందని జాల్ దస్తూర్ జోస్యం చెప్పారు.
ఇది నిజం కాగలదు కూడా !!

## మల్కాజిగిరి బాబా కేంద్రం

మల్కాజిగిరి బాబా కేంద్ర నూతన భవన ప్రాంగణాన్ని శ్రీ శ్రీధర్ కేల్కర్ 19.10.2015న ప్రారంభించారు. మెహెరాబాద్ నుండి శ్రీ జాల్ దస్తూర్ దంపతులు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య బాబావారి చిత్రపటాలను ఆవిష్కరించి, పుష్పమాల వేశారు. కేంద్ర అధ్యక్షులు శ్రీ ఆంజనేయులు గారు పతాకావిష్కరణ చేశారు.
ఆ తర్వాత రెండు గంటలపాటు జోడు గుర్రాల రథాన్ని అధిరోహించిన అవతారుని చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం, ఆనంద్‌భాగ్‌లోని స్థానిక కమ్యూనిటీ హాలులో సహవాస్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర అధ్యక్షులు

శ్రీ ఆంజనేయులు స్వాగతోపన్యాసం చేశారు. శ్రీను బాబు, చెన్నై, శ్రీ గోపాలక్రిష్ణ మెహెర్ బృందం అవతారునిపై భజన గీతాలు ఆలాపించారు.
శ్రీ ఎన్.వి.ఎస్. సత్యనారాయణ, డా॥ కేశవరావు, శ్రీ తోట నాగేశ్వరరావు తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. శ్రీ జగన్నాధరావు, కోశాధికారి మల్కాజిగిరి బాబా కేంద్ర జమా-ఖర్చులు వివరించారు. శ్రీ పి.పి. హరి కార్యదర్శి నివేదిక సమర్పించారు. బాబా కేంద్రాన్ని 2012 నుండి నేటి వరకూ దాదాపుగా అద్దె భవనంలో నిర్వహించాం. నేడు సొంత భవనాల్లోకి మారాం అన్నారు. ఈ నూతన భవనానికి 25 లక్షలు దాకా ఖర్చు చేశామన్నారు. శ్రీకాకుళం కేంద్రం శ్రీ కామేశ్వరరావు గారి దర్శకత్వంలో దివ్య సనాతనుడు అవతార్ విశిష్టత నృత్యగాన సంగీత రూపక ప్రదర్శన జరిగింది. కేంద్ర సభ్యులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# మెహెర్ మేళా

దేశ రాజధాని న్యూ ఢిల్లీలో **మెహెర్ మేళా** 2015 డిసెంబర్ 1, 2, 3 తేదీలలో నిర్వహిస్తున్నట్లు స్థానిక బాబా సెంటర్ ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు.

# బాబాలో ఐక్యం

ఖమ్మం సెంటరు ట్రస్టు సభ్యుడైన శ్రీ వి. కోటేశ్వరరావు గారి తండ్రి శ్రీ ఎల్లమందరావు 14.10.2015న బాబాలో ఐక్యమయ్యారు.

# వివాహం

శ్రీ గజవాడ స్వతంత్రకుమార్, శ్రీమతి విశాల గార్ల కుమారుడు చి. గజవాడ వెంకటేశ్వర్ వివాహం చి.ల.సౌ. ప్రవళికతో 27.11.2015 శుక్రవారం ఉ. 9.51 ని.లకు రంగారెడ్డి జిల్లాలోని పరిగి పట్టణంలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు. కాగా, 29.11.2015 సా. 7 గంటటల నుండి కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవాలయంకు సమీపంలోని వంగ శంకరమ్మ గారెన్స్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేసినట్లు శ్రీ స్వతంత్ర కుమార్ తెలిపారు. బాబా ప్రేమికులు తప్పక హాజ, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతున్నారు.

# గొంగులూరులో ప్రేమిక సహవాస్

గొంగులూరు, పుల్కల్ మండలం, మెదక్ జిల్లాలో మెహెర్ ప్రేమిక సహవాస్ నవంబర్ 1, 2015న నిర్వహించారు. స్థానిక బాబా ప్రేమికులు శ్రీ సింధే ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ – సికింద్రాబాద్‌లలోని బాబా సెంటర్‌ల నుండి శ్రీ బి.రామక్రిష్టయ్య, శ్రీ సత్తయ్య, శ్రీ అప్పారావు తదితరులు హాజరయ్యారు. కాగా, రాబోయే చలికాలంలో చలిని తట్టుకోవడానికి వీలుగా, ఎంపిక చేసిన 125 మంది కడు పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు శ్రీ సింధే ఆంజనేయులు తెలిపారు. ఒక చక్కని స్ఫూర్తిదాయకమైన కార్యక్రమం చేపట్టినట్లు శ్రీ బి. రామక్రిష్ణయ్య అభినందించారు.

# రాజమండ్రి బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా రాజమండ్రి సెంటర్ 7వ వార్షికోత్సవం సందర్భంగా 29.11.2015 ఆదివారం నాడు ప్రేమిక సహవాస్ జరుపుకొంటున్నట్లు శ్రీ కె. నారాయణరావు, అధ్యక్షులు, ఒక ప్రకటనలో తెలిపారు.

# పాలకొండ బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా పాలకొండ సెంటర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా 22.11.2015 ఆదివారం నాడు ప్రేమిక సహవాస్ జరుపుకొంటున్నట్లు శ్రీ ఎ. జనార్ధనరావు, అధ్యక్షులు, శ్రీ ఎమ్. ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# జూబ్లీ బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా జూబ్లీ సెంటర్ 29వ వార్షికోత్సవం 2015 నవంబర్ 15న ఘనంగా జరుపనున్నట్లు శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ ఎస్.వి. మెహెర్ ప్రసాద రాజు, ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెర్‌బాబా పత్రిక

మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. మరిన్ని వివరాలకు ఎడిటర్, మెహెర్‌బాబా, **995 955 3218**ని సంప్రదించగలరు.

# నవజీవనం పాదయాత్ర

అవతార్ మెహెర్‌బాబా నవజీవనం పాదయాత్రను తుమ్మపాల కేంద్ర ప్రేమికులు 2015 అక్టోబరు 16న నిర్వహించారు. స్థానిక తుమ్మపాల బాబా కేంద్రంలో మాజీ ఎం.పి.పి. శ్రీమతి గంగుపాం జలజ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజీవనం పాదయాత్రను రెండేళ్ళపాటు మెహెర్‌బాబా సాగించారన్నారు. తనకున్న సర్వం వదులుకొని బిక్షాటన చేశారన్నారు. మెహెర్‌బాబా నవజీవన పాదయాత్రను పూణే నుండి ప్రారంభించారని గుర్తుచేసుకున్నారు. మానవుని ఆధ్యాత్మిక ప్రయాణాల దైవారాధనే ధ్యేయంగా సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆమె యాత్ర ఉద్దేశ్యాన్ని వివరించారు. ప్రేమ సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. నిత్యం బాబా నామస్మరణ చేయాలని కోరారు. ఈ పాదయాత్ర తుమ్మపాల నుండి అనకాపల్లి మీదుగా కొప్పాక, తల్లారివానిపాలెం, లంకెలపాలెం, శ్రీనగర్ మీదుగా పాత గాజువాక చేరుకుంది. ఈ కార్యక్రమంలో గాజువాక మెహెర్‌బాబా కేంద్రం కన్వీనర్ శ్రీ కాంతారావు, అనకాపల్లి నుంచి శ్రీ సి.ఎన్. సింగ్, శ్రీ రాపర్తి వెంకటరావు, శ్రీ మగపాల వెంకట్, శ్రీ మగపాల నాగు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి నాయుడు, మంత్రి పాహిమా, గండేపల్లి లక్ష్మి, ఇ. నాగరత్నం, జి. కళావతి, ఇ.నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం

01.10.2015 ఉ. 5 గం.ల నుండి 6 గం.ల వరకు లాసన్స్ బే కాలనీ, యం.వి.పి. కాలనీ ప్రాంతంలో బాబా నగర సంకీర్తన, శ్రీ టి.డి.ఎస్. మూర్తి గారి కుటుంబ సభ్యుల సహకారంతో జరిగింది. 16.10.2015న శ్రీ కె.వి. రత్నం గారి ఇంట్లో బాబా నవజీవనం వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటైన సత్సంగ్ కార్యక్రమంలో శ్రీ సి.వై. చింతామణి బృందం సంకీర్తన, కుమారి మాధవీలత ప్రసంగించారు.

# తుమ్మపాల కేంద్ర 4వ వార్షికోత్సవం

తుమ్మపాల బాబా కేంద్ర 4వ వార్షికోత్సవం 25.12.2015న ఉదయం 7 గం.ల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శ్రీ దంతులూరి బంగార్రాజు గారి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కేంద్ర అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ రాపర్తి వెంకటరావు, అధ్యక్షులు (92478 71618), శ్రీ ఉరిటి శ్రీనివాసరావు, కార్యదర్శి (73823 32777) సంప్రదించగలరు.

# బాబా సర్వజ్ఞుడు, ప్రేమ సాగరుడు

**(శ్రీ వి. నిరాకారరావు)**

1934 డిశెంబర్‌లో మెహెర్‌బాబా కాలిఫోర్నియా చేరుకున్నారు.
జీవితంపై విరక్తితో, ఆత్మహత్య చేసుకునే ప్రయత్నంలో వున్న ఒకరిని,
బాబా కాపాడిన సంఘటన ఇది.
నోరినా తన స్నేహితురాలైన మెర్సిడిస్ డి అకోస్టాను బాబా దర్శనార్థం రమ్మనమని ఆహ్వానించింది. అందుకు ఆమె ఇష్టపడ లేదు. ఎంతో బ్రతిమలాడగా సరేనని బాబా దర్శనానికి వచ్చింది. బాబా ఉన్న గదిలోకి వెళ్ళి బాబాను చూసి చూడగానే ఆమె నిర్ఘాంత పోయింది. అనురాగ ప్రేమ తరంగాలు బాబా నుండి నలువైపుల నుండి ప్రసరిస్తున్న అనుభూతికి ఆమె లోనైంది. అనుకోకుండా బాబా పాదాలపై పడింది. "మీరెవరు ?" అని బాబాని ఆమె అడిగింది.
"నువ్వే నేను" అని బాబా సంజ్ఞ చేశారు.
ఆ వెంటనే, తన అక్షర ఫలకంపై " నీవు వెళ్ళి కారులో వుంచిన
రివాల్వరు తీసుకు రమ్మన్నారు!" ఆమె మళ్ళీ నిర్ఘాంతపోయింది.
తన కారులో ఉంచిన రివాల్వర్ సంగతి ఆమెకు తప్ప మరెవ్వరికీ తెలియదు కదా!!
ఆ పిదప రివాల్వరును తెచ్చి బాబాకు ఇచ్చింది.
బాబా దాన్ని అందుకొని రివాల్వర్‌లో ఉన్న గుండ్లను ఒక్కొక్కటిగా తొలగించి
ఖాళీ రివాల్వరును ఆమె చేతికిచ్చి ప్రేమతో ఓదారుస్తూ ఇలా అన్నారు ...
"ఆత్మహత్య నీ సమస్యకు పరిష్కారం కానే కాదు.
తిరిగి అవే సమస్యలతో జన్మించడానికి దోహదం చేస్తుంది.
ఏకైక పరిష్కారం – భగవంతుణ్ణి అందరిలో అన్నింటిలో దర్శించగలగడం.
అప్పుడు ప్రతి విషయం సులభతరమౌతుంది.
ఈ రివాల్వరును దూరంగా పెట్టి మళ్ళీ ఆత్మహత్య గురించి ఆలోచించనని
నాకు వాగ్దానం చేయి అన్నారు బాబా.
వెంటనే ఆమె బాబాకు మాట ఇస్తూ,
"ఆత్మహత్య తలంపు మళ్ళీ రానివ్వనని" హామీ ఇచ్చింది.
తన జీవితంలో ఇంతవరకు కనీ విని ఎరుగని ప్రేమను బాబా దగ్గర
తాను చవిచూశానని, ఆమె తన రెండు చేతులూ జోడించింది!

**మెహెరు ప్రభు చరితం, 5వ భాగం పుట: 2087**

# భీమ్లి కేంద్ర వెండి పండుగలు




అవతార్ మెహెర్‌బాబా భీమునిపట్నం కేంద్రం రజతోత్సవాలు 2015 అక్టోబరు 10, 11 తేదీలలో కదు రమ్యంగా జరిగాయి. సా. 5.30 ని.లకు బాబావారి ప్రార్ధన, సంకీర్తనలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం, శ్రీకాకుళం నృత్య దర్శకులు శ్రీ వి. కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన చిన్నారుల నృత్యాభినయం ప్రేమికులను అలరించింది. శ్రీ కోట్ర వెంకట్రావు గారి బృందం 'అవతారుని జీవిత చరిత్రను 'యక్షగాన రూపంలో కదు రమ్యంగా ప్రదర్శించారు. ఆ మర్నాడు, 11.10.2015 ఉదయం 6.30 ని.లకు భీమిలి సాగర తీరం మీదుగా పురవీధుల్లో సాగిన ఊరేగింపు శోభాయమానంగా సాగింది. సప్తవర్ణ పతాకములు చేబూని ప్రేమికులు జయజయ ధ్వానాలు చేస్తూ సాగిన నామస్మరణ వీనులవిందుగా, కన్నుల పండుగగా సాగింది. అనంతరం, శ్రీ టి.డి.ఎస్. మూర్తి, విశాఖపట్నం బాబా 'సప్తవర్ణ పతాకావిష్కరణ' చేశారు. తదుపరి మెహెర్ ప్రేమిక సహవాస్ 9 గం.లకు ప్రారంభమై మధ్యాహ్నం 2 దాకా అత్యధిక ప్రేమికుల ఆనందోత్సాహముల నడుమ రమణీయంగా సాగింది. డా॥ పి. ఉషాదేవి, విశాఖపట్నం సహవాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ ఎస్.వి. మెహెర్ ప్రసాద్‌రాజు, కార్యదర్శి, ఆంధ్రా సెంటర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కేంద్ర సంస్థాపక సభ్యులైన శ్రీ సి.వై. చింతామణి భీమిలి కేంద్ర ఆవిర్భావం గురించి వివరించారు. శ్రీ యు. బాపిరాజు, శ్రీ యం. మల్లిఖార్జునరావు, శ్రీ నోరి హనుమంతరావు తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. కేంద్ర కార్యదర్శి శ్రీమతి మందా రమ, శ్రీ వై. బోసు బాబు, శ్రీమతి మెహెర్ మాయ, శ్రీమతి సూర్యకుమారి తదితరులు సహవాస్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - *తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

***(గత సంచిక తరువాయి)***

ఇదీ అతని తపన, మూగ వేదన.
భక్తుడి వేదన ప్రభువుకి తెలియదా!
తెలుసు. తెలిస్తే, ఏం చేశారు? పక పకా నవ్వారు.
గడ్డి పెడ్తావా? పట్టుకురా! అన్నారు.
నాకు గడ్డి కావాలి అంటున్నాగా ఈ మధ్య అన్నారు.
శాఖాహారాన్ని చాలా మంచి గడ్డి అంటారు కదా.
అదే మాట బాబావారన్నారు.
రావ్‌సాహెబ్‌ని ఆట పట్టించారు.
పరిష్యాలో ఏదైనా దొరుకుతుంది కానీ, శాఖాహారం మచ్చుకైనా కనబడదు.
అందుకని మాసాజీ గారు వంటవాడు అయ్యారు. వంటచేశారు.
ఇప్పుడు ఏం చేయాలి బాబా అని మధనపడుతున్న రావ్‌సాహెబ్‌కీ,
మాసాజీకీ బాబావారే దారి చూపించారు.
అది ఎలాగని అంటే, కొంచెం దూరం వెళ్ళాక పుచ్చకాయలు కనిపించాయి.
హమ్మయ్య! బ్రతికాం అనుకొంటూ మన మేనేజరు గారు పుచ్చకాయలు కొన్నారు.
మాసాజీ కోసి పెడితే, బాబావారు కాసిని తిని మిగిలినవి రావ్‌సాహెబ్‌కి ఇచ్చారు.
ఇవి తింటే నీ పాపం తగ్గుతుంది అన్నారు నవ్వుతూ.
బామ్ నగరాలు చేరే సరికి బాగా చీకటి పడింది.
అక్కడి నుంచి దుజ్‌దాబ్ వెళ్ళాలి.
ఎంత జాగ్రత్తగా వెళ్ళినా దుజ్దాద్ చేరేసరికి రెండు రోజులు పడుతుంది.
అది ఎడారి దారి. చీకటిలో ఎడారిలో కారులోనో, బస్సులోనో వెళ్ళటం మంచిదేనా?
అబ్బే! మంచి పని కాదన్నారు స్థానికులు.
ఇసుకలో చక్రం దిగితే సాయపడేవారు ఉండరని హెచ్చరించారు.
దోపిడీ దొంగల బెడద ఎక్కువ అని భయపెట్టారు.
ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్ళాలి.

బస్సులు, ట్రక్కులు దారి తప్పి చనిపోయిన వారెందరో ఈ దారిలో ఎండకి సలసలా మాడిపోతారు. దుజాదాబ్ ప్రాణాలతో చేరితే అల్లా రెండో జన్మ ప్రసాదించినట్లేనన్నాడు ఓ పెద్దమనిషి.
ఎందుకు అనవసరంగా కష్టాలు కొని తెచ్చుకోవడం అన్నాడు రావ్‌సాహెబ్.
ఆ రాత్రికి తలదాచుకోడానికి ఊరు శివార్లలో బస కుదిర్చాడు.
అందరూ శుభ్రంగా స్నానం చేశారు.
ఇసఫహాన్ వదిలిపెట్టాక ఇదే వాళ్ళ తొలి స్నానం.
ఇసఫహాన్ నుంచి అక్టోబరు 22న బయలుదేరారు.
ఈవేళ అక్టోబరు 30. అంటే వారం అయింది స్నానం చేసి.
స్నానం చేశాక బాబావారి చుట్టూ చేరారు మండలి.
ఆ మాటా ఈ మాటా మాట్లాడుతుంటే, మనస్సు మెహెరాబాద్‌పైకి మళ్ళింది.
ఇండియాకి వెళ్ళిపోతే బాగుండును అనుకొన్నారు మండలి.
ఆఘూ ఆలీ ఇంటికి వెళ్ళిపోయాడు కదా!
వాడి వంటి కుర్రాడిని వెతకండి అని బాబావారు ఆదేశించారు.
వెంటనే రావ్‌సాహెబ్ ఊళ్ళోకి వెళ్ళాడు.
నలుగురినీ వాకబ్ చేసి, ఓ మంచి కుర్రాడిని తీసుకువచ్చాడు.
బాబావారితో ఇండియాకి రావటానికి ఆ కుర్రాడు సిద్ధమయ్యాడు.
అతని తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పలేదు.
మర్నాడు, అక్టోబరు 31వ తేదీ. ఇంటి బయటికి వెళ్ళాడు గుస్తాద్ గారు.
ఎదురుగా దుకాణంలో ఓ మనిషి కనిపించాడు.
రెండు చేతులూ ఎత్తి నమస్కరించాలనిపిస్తోంది.
ఆయన్ని చూస్తూ వున్నాడు.
అందరికీ అతనంటే చాలా భక్తి, గౌరవం.
ఈ మాటే బాబావారికి చెప్పాడు.
వెంటనే బాబావారు అతడిని చూడటానికి బయటకి వచ్చారు.
బాబావారి రాకని గమనించిన అతను బాబావారి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చాడు.
చేతిని ముద్దాడాడు. బాబావారతన్ని అక్కున చేర్చుకొన్నారు.
ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అయిన ఆ పర్షియన్ ఆసామి వెను తిరిగి వెళ్ళిపోయాడు.
ఇదేమిటి! అతను అలా వెళ్ళిపోతున్నాడేమిటి! అనుకొన్నారు మండలి.
అతడిని తీసుకురండి అని బాబావారు అనడం, వెదికి పట్టుకోవడం, బాబావారతన్ని తన గదికి తీసుకువెళ్ళడం, చిటికెలో జరిగిపోయాయి.
బాబావారతనితో ఏ విశ్వ కార్యక్రమం నిర్వహించారో తెలియదు కానీ అతను వెళ్ళిపోతుంటే,

తమ పరుపు ఇచ్చారు. మహదానందంగా స్వీకరించాడు అ కానుకని అతను.
సామాన్యుడు కాదు అతను.
వలీ, ఐదవ భూమికలో వున్నాడని బాబావారే శెలవిచ్చారు.
అతని పేరు తెలియదు కానీ అతగాడు అందరికీ ఒకటే చెప్పాడు.
ఫకీర్లకే మహా చక్రవర్తి మన మధ్య వున్నాడని సాధికారంగా ప్రకటించారు.
బహుశా ఈ శుభసమయానికి గుర్తుగా అనుకొంటా, బువాసాహెబ్ మీసం తీసేశాడు.
నూనూగు మీసాలు వచ్చినప్పటి నుంచి మీసం
పొరపాటున కూడా తీయ్యలేదు ఒక్కసారి కూడా.
మీసం తీసేస్తే మొహం బోసిపోయినట్లుంటుంది ఎవరికైనా.
రోజూ చూస్తున్నవాళ్ళే బువాని గుర్తు పట్టలేక పోయారు.
అయితే ఇదేమీ పట్టలేదు బాబావారికి.
పైపెచ్చు ఏమన్నారో తెలుసా?
హమ్మయ్య! కీడు పోయింది అన్నారు.
కీడు అంటే ఏరకమయిన కీడు.
అందువల్ల ఏమయ్యేది అని వివరాలు చెప్పలేదు కానీ,
యెజ్డ్‌లో తమకి ఆతిధ్యం ఇచ్చిన,
రుస్తుం ఖుస్రోవ్ గురించి ప్రస్తావించారు.
షావుకారు మంచి ఏర్పాట్లు చేశాడన్నారు.
నాలుగు పెద్ద కార్యక్రమాలని పెట్టాడన్నారు.
ఊరంతా తరలి వచ్చింది.
ప్రేమవాహినిలో మునిగి తేలింది అన్నారు.
పాఠకులకి తెలుసుగా బాబావారు యెజ్డ్‌లో దర్శనం ఇచ్చారు.
తన పరిష్యా యాత్రలో మరెక్కడ దర్శనం ఇవ్వలేదు.
ఏకాంతవాసం వున్నా సరే దర్శనం ఇచ్చారంటే,
యెజ్డ్ నగర వాసులు ఎంత పుణ్యం చేసుకొన్నారో.
యెజ్డ్‌లో వుండగా ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది.
షిరాజ్ నుంచి బహాయిల మత పెద్ద వచ్చాడు.
బాబావారి దర్శనార్ధం కాదు.
బాబావారి బండారం బయటపెడ్తానంటూ రెక్కలు కట్టుకుని వాలాడు.
రెక్కలు కట్టుకొని అంటే నిజంగా రెక్కలు కట్టుకొన్నాడని కాదు.
షిరాజ్ నుంచి విమానంలో వచ్చాడు.
బాబావారిని ప్రశ్నలతో ముంచెత్తి,

ఊపిరి ఆడకుండా వుక్కిరి బిక్కిరి చేసి నిజం చెప్పిస్తానని
ప్రగల్భాలు పలికాడు షిరాజ్ నుంచి బయలుదేరే ముందు.
మరి అన్నంత పని చేశాడా?
ఈ సంగతిని చెప్పేముందు బహాయి మతం గురించి చెప్పాలి.
హాఫీజ్ వంటి సద్గురువులు, కవులకి నిలయమైన షిరాజ్‌లో పుట్టింది బహాయి మతం.
ఆధ్యాత్మికంగా మానవాళి అంతా ఒక్కటే అన్నది ఈ మతస్థుల గట్టి నమ్మకం.
బహాయి మతాన్ని స్థాపించింది బహావుల్లా.
ఈయన బాబ్ నుంచి ఆధ్యాత్మిక తీర్థం స్వీకరించాడు.
బాబ్ ఎవరు?
ఈ ఉత్తముడు ఒక కుతుబ్.
1819లో జన్మించి 1850లో కన్నుమూసిన బాబ్‌ని
ఆలీ అహమ్మద్ అని ప్రస్తుతించేవారు.
మరి అంతటి మహాత్ముని శిష్యరికంలో మతమన్నది
కంటికి మసక అని బహావుల్లా గ్రహించాడు.
మానవాళి సముద్ధరణకై కొత్త మతాన్ని ఆవిష్కరించాడు.
1817లో జన్మించిన బహావుల్లా 1892లో స్వర్గస్థులయ్యారు.
మన దేశంలో కూడా బహాయి మతస్థులు చాలామంది వున్నారు ఇప్పటికీ.
ఇదీ స్థూలంగా బహాయి మతం విశిష్టత.
మనం మళ్ళా మెహెరీశుని కథలోకి వస్తే,
షిరాజ్ నుంచి వచ్చిన బహాయి మత పెద్ద
బాబావారిని చూస్తూ వచ్చిన పని మరచిపోయాడు.
ఎన్నో ప్రశ్నలు అడగాలనుకొన్నవాడికి
ఒక్క ప్రశ్న కూడా గుర్తుకు రాలేదు సరికదా
అశ్రు నయనాలతో, సాక్షాత్తు భగవంతుడివి నువ్వే బాబా అంటూ
సాష్టాంగ ప్రమాణం చేశాడు. బాబావారి గది నుంచి బయటకి వస్తూనే
ఏమన్నాడో తెలుసా? ఈ వేళ నేను దేముడిని కలిశాను అన్నాడు.
షిరాజ్‌లోనేమో మెహెర్‌బాబా రసూల్ కాదు.
మానవాళి రక్షకుడు కాదని గంట బజాయించి మరీ చెప్పాడు.
ఇక్కడ యెజ్డ్‌లో ప్రభు దర్శనంతో జ్ఞానోదయమయింది.
అంటే మన బహాయి మత పెద్ద అదృష్టవంతుడని చెప్పక తప్పదు.
బాబ్ నగరంలో ఉండగా మరో గమ్మత్తు జరిగింది.
పరిష్యా సైనికాధికారి ఒకరు వచ్చాడు బాబావారి దర్శనానికి.

మిలట్రీ యూనిఫారంలో ఉన్నాడు.
ఆ బట్టలు చూస్తే ఈయన ఒక జనరల్ అని చిటికెలో తెలుస్తుంది ఎవరికయినా.
జనరల్ గారు కాబట్టి కరవాలంలో ఖడ్గం నిగనిగలాడుతోంది.
మెహెర్‌బాబావారిని కలవాలి. ఇప్పుడు దర్శనం దొరుకుతుందా? అని మండలివారిని అడిగాడు. మండలివారి నోటికి బాబావారు తాళం వేశారనీ,
మెహెర్‌బాబావారు అక్కడ ఉన్నారన్న సంగతి కలలో కూడా చెప్పరని పాపం అతనికి తెలియదు. అందుకనే తరచి తరచి మరీ అడిగాడు.
వాళ్ళు ఏమో, మాకు తెలియదు అన్నారు.
మెహెర్‌బాబా అన్న వ్యక్తి ఇక్కడ లేరని చెప్పారు.
అయితే పరిష్యా సైనికాధికారి వాళ్ళ మాటలని పట్టించుకోలేదు సరికదా
"వాకిటి ముంగిట నిలుచున్నాడు. ఓ యాచకుడని చెప్పండి, మీ గురువు గారికి" అన్నాడు". మండలివారు కాదనలేకపోయారు.
బాబావారికి అతని గురించి చెప్పారు. ప్రభువు కరుణించాడు.
తీసుకురండి అతన్ని లోపలికన్నారు.
వస్తూనే పరిష్యన్ పద్ధతిలో అభివాదం చేశాడు.
రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టినట్లు.
అక్కడివారు రెండు చేతుల్నీ ఛాతీపై పెట్టుకొంటారు పెద్దవాళ్ళ ముందుకు రాగానే.
మిలట్రీ ఆఫీసరు కదా శాల్యూట్ కూడా చెప్పాడు.
ఎంతైనా అలవాటు ఎక్కడికి పోతుందని కొట్టేయకండి.
ఎందుకంటే, బాబావారికి ప్రణామం చేస్తూనే,
ఒరలో నుంచి ఖడ్గాన్ని తీసి క్రింద పెట్టాడు.
బాబావారి పాదాల దగ్గర మోకరిల్లాడు.
భక్తితో బాబావారి చేతిని ముద్దు పెట్టుకున్నాడు.
అతను కాస్తంత స్థిమితపడ్డాక బాబావారు కుశల ప్రశ్నలు వేశారు.

**బాబా:** ఏం చేస్తుంటావ్?

**అధికారి:** మీ దాసుడిని

**బాబా:** నీ ర్యాంక్, అదే హోదా?

**అధికారి**: నా ర్యాంకా! మీ ఔన్నత్యం ముందు నా హోదా ఎంత? అది వుట్టి దండగ.

**బాబా:** నేనడుగుతున్నది ఆర్మీలో నీ ర్యాంకు గురించి?

**అధికారి:** పరిష్యా ఆర్మీలో పెద్ద ఆఫీసర్‌ని, జనరల్‌ని.

బాబావారు అతని తల, వీపు నిమిరారు.
దేశ సేవలో ప్రాణ త్యాగం ఎంతో గర్వ కారణమన్నారు.

విజయమో, వీర స్వర్గమో అని కదా అంటారు.
భగవంతుడిని సేవిస్తూ మరణించడం ఇంకా మరెంతో గొప్ప మరణం అన్నారు.
జనరల్ గారు తల వూపారు.
ఈ వరమే ప్రసాదించి నన్ను కరుణించు స్వామి.
భక్తి పెంచు, నా జన్మని ధన్యం చేయి అని వేడుకున్నాడు.
పరబ్రహ్మ చిరు దరహాసం చేశాడు.
అభయం పలికాడు. సైనికాధికారికి ఆనందంతో నోట మాట రాలేదు.
భక్తితో కళ్ళు మూతలుపడ్డాయి. మరో విన్నపం చేశాడు.
"ప్రభు! అనుమతిస్తే మరో చిన్న కోరిక కోరాలని వుంది అన్నాడు.
ఏమిటి ఆ కోరిక. నిరక్షరాస్యులైన మా దేశ ప్రజలపై కనికరించండి.
నిర్భాగ్యమైన మా పరిష్యాపై కృప చూపండి అని వేడుకొన్నాడు.
మా దేశానికి ముక్తి సైనిక బలంతో రాదు.
మీ వంటి సద్గురువుల కృపా కటాక్షాలతో ఆధ్యాత్మిక దృక్పథం కలిగితేనే మా దేశోద్ధరణ జరుగుతుంది. కాబట్టి, ప్రభూ మా పరిష్యా దేశంపై దయ చూపండి ఆధ్యాత్మిక మార్గంలో పడేయండి అని సవినయంగా మనవి చేశాడు.
మెహెరీశ్వరుడు చిరునవ్వు నవ్వారు.
తమ రాక ప్రధానోద్దేశ్యం పరిష్యాలో ఆధ్యాత్మికతను నెలకొల్పడమేనని స్పష్టం చేశారు.
ఇందుకే కదా ఈ గడ్డపై కాలు పెట్టాను.
ఆ సైనికాధికారి ఆనందాన్ని మాటల్లో చెప్పలేము.
ప్రభువు తన కోర్కెను వెంటనే తీరుస్తాడని ఊహించ లేదు.
ఎంత సుదినం ఈవాళ అనిపించింది.
ఇదంతా మా దేశం చేసుకొన్న అదృష్టం అని పొంగి పోయాడు.
మెహెరుని ఆశీస్సులతో పరిష్యా పునీతమవుతుందని అంటూ శెలవు తీసుకొన్నాడు.
సైన్యంలో ఎవరయినా పై అధికారి ముందుకి వెళితే మాటా మంతీ అయ్యాక వెళ్ళేటప్పుడు వీపు చూపించక వెనక్కి నడుస్తూ వెడతారు.
ఇది మిలట్రీ సంప్రదాయం.
బాబావారిని దర్శించి తరించిన జనరల్‌గారు కూడా సైనిక సంప్రదాయాన్ని తు.చ. తప్పకుండా పాటించాడు.
బాబావారి వైపు చూస్తూ వెనక్కి అడుగులో అడుగు వేస్తూ నిష్క్రమించాడు.
ఈ దృశ్యం చూస్తున్న మండలివారికి ఒళ్ళు పులకరించింది.
ఆహా! ఏమి భక్తి! ఎంత శ్రద్ధ అని అబ్బురపడ్డారు.
ఆవాళ మరో ఉన్నతాధికారి వచ్చాడు బాబావారి దగ్గరకి.

ఈయన బాబ్ నగర పోలీసు కమీషనర్.
అప్పటి పరిష్యా చట్టం ప్రకారం, విదేశీయులు ఎవరైనా వచ్చినా,
వాళ్ళ భోగట్టాని పోలీసులు సేకరించాలి.
పేరు, వృత్తి, ఏ పని మేరకు వచ్చారో నమోదు చేసుకోవాలి.
పోలీసు కమీషనర్ గారికి అవసరమైన భోగట్టా ఛాన్జీ గారు ఇచ్చారు.
ఆ వివరాలు రాసుకున్నాక అడిగాడాయన మీ నాయకుడు అర్జాబ్ మేర్వాన్‌ని చూడాలని
వుంది అన్నాడు. అర్జాబ్ అంటే పరిష్యా భాషలో శ్రీ అని అర్థం.
బాబావారిని చూడాలని ఎందరో అడగటం, వీలుకాదని చెప్పడం ఛాన్జీ గారికి కొత్తకాదు.
ఈవేళా అంతే చేశాడు. అయితే పోలీసు కమీషనర్ గారు వదల్లేదు.
పైపెచ్చు తన అధికార దర్పం కూడా ప్రదర్శించాడు.
ప్రభుత్వ నియమాల ప్రకారం, మీ నాయకుడిని స్వయంగా ప్రశ్నించాలి అన్నాడు.
అదేమీ కుదరదన్నాడు ఛాన్జీ గారు. ఆయనేమీ తక్కువవాడు కాదు కదా.
ఎంతైనా బాబావారి కార్యదర్శి మరి. పోలీసు కమీషనరు గారు ఖంగుతిన్నాడు.
నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు అన్నాడు.
మెహెర్‌బాబా దర్శనం కోసం తహతహలాడుతున్నానన్నాడు.
ఏదోలాగా లోపలికి వద్దామనే నా అధికారం ఉపయోగించానే తప్ప
ఇంకేమీ కాదన్నాడు. నా మాట కాదనకండి.
హజరత్ మెహెర్‌బాబా దర్శన భాగ్యం కల్గించండని ప్రాధేయపడ్డాడు.
నగర పోలీసు కమీషనరు అంతగా అడుగుతుంటే ఎవరైనా కాదన గలరా?
బాబావారికి చెప్పి చూస్తాను అన్నాడు ఛాన్జీ.
అదే మహద్భాగ్యం అన్నాడు ఆ పెద్ద మనిషి.
బాబావారికి అతని గురించి చెప్పగానే తమ గదికి పంపమన్నారు.
బాబావారి పిలుపుతో పోలీసు ఉన్నతాధికారి ఎగిరి గంతేసినంత పని చేశాడు.
మెహెరు ప్రభు దర్శనం ఒక అమూల్య వరం నాకు అన్నాడు.
ప్రభువు గదిలోకి అడుగుపెడ్తూనే సాదరంగా అభివాదం చేశాడు.
స్థానిక సంప్రదాయం ప్రకారం, మెహెరీశుని చేతికి ముద్దు పెట్టాడు.
బాబావారు ప్రసన్నులయ్యారు. ఇలారా, నా ప్రక్కన కూర్చో అన్నారు.
దర్శనమే కరువు అవుతుందేమో అని భయపడుతున్న వ్యక్తికి
ప్రభు ప్రక్కనే కూర్చునే భాగ్యం లభించింది.
అతగాడు ఎంత పుణ్యం చేసుకొన్నాడో కదూ!
బాబావారు త్వరలో ఇండియాకి వాపసు వెడతారని తెలుసు అతనికి.
ఇండియాలో మొదటి మజిలీ క్వెట్టా అనీ విన్నాడు.

బాబావారీ సంగతిని ప్రస్తావించారు. క్వెట్టా వెళ్ళినా త్వరలోనే మీదేశం వస్తాను
అన్నారు. తమ మౌన విరమణ, అవతార వ్యక్తీకరణ పరిష్యాలోనే చేస్తానన్నారు.
ధన్యోస్మి ప్రభూ అన్నాడు ఆ పోలీసాయన. మా పరిష్యా ఎంతో పుణ్యం చేసుకొంది
అన్నాడు. మీరు అవతారపురుషులని ఎందరో అంటూంటే విన్నాను.
మిమల్ని దర్శించి, తరించే భాగ్యం ప్రసాదించారు.
నా జన్మ తరించింది అన్నాడు. మీకేం కావాలి? చెప్పండి.
వెంటనే అవసరమయిన ఏర్పాట్లు చేస్తానని సవినయంగా మనవి చేశాడు.
ఎంతయినా పోలీసు కమీషనరు కదా. పోలీసులు తలుచుకొంటే ఏపనయినా చేస్తారు.
మనకి తెలియనది ఏముంది. కానీ ఏదో మొక్కుబడికి అంటున్నాడా?
నిజంగా అంటున్నాడా? ఈ అనుమానం సహజమే ఎవరికైనా.
ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే పోలీసు కమీషనరు గారి సంగతి వేరే చెప్పాలా?
వీళ్ళు నా మాట నమ్ముతున్నట్లు లేదు. ఏదో మాటతో సరి అంటున్నాననుకొంటున్నారు
అనిపించింది. రఫీమని మనస్సులో మాట చెప్పాడు మండలివారికి.
మీరు ఎంతో అదృష్టవంతులు. పూర్వజన్మ సుకృతం కావచ్చు.
మరేదైనా కావచ్చు. ఏది ఏమయినా సద్గురువు సాన్నిధ్యంలో వుంటున్నారు.
ధన్యజీవులు మీరు అన్నాడు. బాబావారి కొత్త మజిలీ దుజ్‌దాబ్.
ఆ ఊరు బాయ్‌కి కొంచెం దూరమే. ఏ ఇబ్బందీ లేకుండా బస్సు నడిస్తే,
మూడు నాలుగు రోజులు పడ్తుంది అక్కడికి చేరటానికి. బాబావారి ప్రయాణపు
ఏర్పాట్లు విన్న బాబ్ వాసులు ప్రభు దర్శనానికి వచ్చారు.
వీరికి దర్శనం ఇవ్వరేమో అని మండలివారనుకొన్నారు.
కానీ, వాళ్ళు ఊహించని విధంగా బాబావారు అందరికీ తమ దర్శన భాగ్యం కల్గించారు.
ఇంతలో రావ్‌సాహెబ్ బస్సు మాట్లాడాడు. అనుభవజ్ఞ డ్రైవరును మాట్లాడాడు.
అతనిపేరు హాఫీజ్‌జీ. జాగ్రత్తగా ఆ బస్సు నడపమన్నాడు.
కక్కుర్తిపడి ఎవరి మూటలు వేయకు బస్సుపైన. మా లగేజీకే చోటు సరిపోదు
అని హెచ్చరించాడు. హాఫీజ్‌జీ బుర్ర వూపాడు. మీరు చెప్పినట్లే చేస్తాను అన్నాడు.
ఏదో ఒక రెండు రూపాయిలు దొరుకుతాయని కక్కుర్తిపడి ఎవరి సామాను మూటలు
వేసుకోను అని హామీ ఇచ్చాడు. నాకీదారి కొత్తకాదు జాగ్రత్తగా తీసుకువెడతానని
భరోసా పలికాడు. బస్సు ఎక్కేముందు రావ్‌సాహెబ్ తీసుకువచ్చిన కుర్రాడికి బాబావారు
స్నానం చేయించారు. కొత్తబట్టలు తొడిగారు. అప్పటికి మధ్యాహ్నం అయింది.
ఆవేళ నవంబరు 1వ తేదీ. బస్సు ఎక్కారు బాబా. ఆయన వెంట మండలివారూ బస్సు
ఎక్కారు. రైట్, రైట్ చెప్పేసరికి నాలుగు అయింది.

**-సశేషం**

# జీన్ ఆడ్రియల్



జీన్ ఆడ్రియల్ పాశ్చాత్య బాబా ప్రేమికురాలు. 1931లో తొలిసారిగా మెహెర్‌బాబాను అమెరికాలో దర్శించుకుని, కడదాకా అవతారునికి విధేయురాలిగా వున్నది. అంతేకాదు, మెహెర్‌బాబా ప్రప్రథమంగా అమెరికా వెళ్ళినప్పుడు సుమారు నెల రోజులపాటు ఆవతారునికి ఆయన మండలి సభ్యులకు ఆతిధ్యమిచ్చిన గొప్ప ధన్యురాలు జీన్. ఆమె అనుభవాలను క్రోడీకరిస్తూ బాబా గురించి తెలియజెప్పేలా అవతార్ (AVATAR) అనే గ్రంథం ఆమె వ్రాసింది. ఆ గ్రంథం చదివిన వాళ్ళు ఎందరో మెహెర్‌బాబాను దర్శించుకోవాలని తహ తహ లాడారు. 1931 తర్వాత కూడా జీన్ ఆడ్రియల్ మెహెర్‌బాబానుఅనేసార్లు దర్శించుకుంది. బాబావారి నాసిక్ ఆశ్రమంలో వుంది. ఐతే, ఒక చిన్న సంఘటనతో ఆమె మెహెర్‌బాబా నుండి, ఆయన ప్రేమికులకు దూరంగా, ఆమె ఎక్కడ వుంటోందో, ఏం చేస్తోందో, అమె చిరునామా కూడా తెలియనంత దూరంలో సుమారు దశాబ్దంన్నర పాటు గడిపింది. **ఇదే జీన్ ఆడ్రియల్ విశేషత.**

మెహెరుడి పరిధిలోకి మన ఇష్టంతో వచ్చామని అనుకోవడానికి వీలులేదని ఈమె గురించి తెలుసుకుంటే అర్థమవుతుంది. బాబా ప్రేమ పొందడానికి అర్హులైనవారు మాత్రమే, ఏ కొందరో బాబా పరిధిలోకి రాగల్గుతారు. ఆ ఎంపిక ప్రక్రియ అవతారుని చేతులోనే వుందని మరోమారు ఈ శీర్షిక చదివినవారికి స్పష్టమౌతుంది.

ఇకపై జీన్ గురించి చదవండి. ఇది మెహెర్‌బాబా పాఠకులకు ప్రత్యేకం.

ఆమె అసలు పేరు జీన్ రాబిన్ సన్. 1892 సెప్టెంబర్ 21న అమెరికాలోని పెన్సిల్‌వేనియాలో జన్మించింది. న్యూమరాలజీని అనుసరించి అమె తన పేరును **జీన్ అడ్రియల్‌గా** మార్చుకుంది. సన్నగా, పొడవుగా, రాచఠీవీతో ఉండేదామె. ఆమె మాట్లాడుతుంటే ఎంతో మధురంగా ఉండేది. ఆమె సాంఘిక సమాజ సేవా కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొనింది. కవి, పండితుడైన **మాల్కం స్కోలస్‌ను** ఆమె పెళ్ళి చేసుకుంది. వీరిద్దరూ కూడా metaphysics ఎక్కువగా అధ్యయనం చేశారు. ఈ మేరకు న్యూయార్క్ నగరంలో నార్త్ నోడ్ అనే ప్రాంతంలో ఒక ఆధ్యాత్మిక పుస్తకాల షాపు నిర్వహించారు. ఈ పుస్తకాల షాపు ద్వారా వీరిద్దరూ 1920-30 దశకంలో ఎందరో ఆధ్యాత్మిక చింతనాపరులను కలిశారు.

1930వ దశకంలో వీరు మెహెర్‌బాబాను తొలిసారిగా కలిసారు.

1931లో ఒక రోజున ఒక స్నేహితుని ద్వారా మెహెర్‌బాబా ఇంగ్లాండ్‌కు త్వరలో వస్తున్నారని తెలుసుకుని, వీరిద్దరూ లండన్‌కి వెళ్దామని సిద్ధమయ్యారు.

ఐతే, ఇంతలోనే మెహెర్‌బాబా నుండి కేబుల్ (టెలిగ్రాం) అందుకున్నారు.

ఆ టెలిగ్రాంలో మీరు లండన్‌లోకు వచ్చేకంటే, నేను అమెరికా వచ్చినప్పుడు కలిసే ప్రయత్నం చేయమన్నారు బాబా. అందుకు తగిన ఏర్పాట్లు అమెరికాలో చేయమని జీన్-మాల్కోంలను బాబా కోరారు. అందుకనుగుణంగానే, హర్మన్ అనే ప్రాంతంలో ఒక చక్కని భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. మెహెర్‌బాబా హర్మన్‌లో నెల రోజులు బస చేశారు. జీన్ మాల్కంలు మెహెర్‌బాబాను ఆ మాదిరిగా 1931లో తొలిసారిగా దర్శించుకున్నారు. ఆ సమయంలో జీన్ తన మనస్సులోని భావాలను ఇలా వివరించింది.

“నా కళ్ళు అవతారుడిని తొలిసారిగా దర్శించుకున్నప్పుడు,
అంతులేని అనంతమైన ప్రేమ మహాసాగరంలో మునిగినట్లు,
ఒక్క క్షణం నా నోటి వెంట మాట రాలేదు. నా హృదయం తెలియని ఏదో ఆవేదనతో నిండింది. నేనింతకాలం బ్రతికి వుంది, దయామయుడైన, ప్రేమ సముద్రుని దర్శనం కోసమేననిపించింది. నిజానికి నేనింత క్రితం జీవించి వున్నాననిపించ లేదు.
మెహెర్‌బాబా నాకు ఎన్నో సంవత్సరాలుగా పరిచయమున్న వ్యక్తిలా వున్నారు.
ఏ మాత్రం కొత్త అనిపించ లేదు. తానెంతగానో ఆరాధించే, ప్రేమించే అపురూపమైన వ్యక్తిగా అనిపించారు. !!

బాబా హర్మన్‌లో వున్న నెల రోజుల్లో ఎందరో స్థానికుల్ని కలిసారు.

ప్రిన్సెస్ మాచబెల్లీ, ఎలిజెబెత్ పాటర్‌సన్‌లు కూడా ఇక్కడే మెహెర్‌బాబాని తొలిసారిగా దర్శించుకున్నారు. జీన్-మాల్కంలు ఇద్దరూ తాము ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధ్యాత్మిక గురువు లభించాడని తృప్తి చెందారు.

ఇక వారు అటు-ఇటు వెళ్ళాల్సిన పని లేదని, సంపూర్ణంగా మెహెర్ బాబాకు అంకితమయ్యామని, బాబాని దర్శించుకున్న 11 రోజులకే వారిద్దరూ బహిరంగంగా ప్రకటించారు. అమెరికాలోని తన ప్రేమికులు స్కోలస్, ఎలిజిబెత్ పాటర్‌సన్, నోరినా మోచ్‌బెల్లీ, నాడినే టాలిస్టాయ్, అనితా డి కారోలను బాబా **జీన్‌కో** JEANCO అని పిలిచేవారు. వీరు నాకు అత్యంత సన్నిహిత సభ్యులని బాబా అన్నారు.

ఆ పిదప, జీన్-మాల్కోమ్‌లను బాబా తన సహజ దోరణిలో పరీక్షలకు గురి చేశారు. రెండవసారి బాబా అమెరికా పర్యటనకు 1932లో వెళ్ళారు.

ఈ సమయంలో హాలీవుడ్ తారలు చాలామందిని జీన్ ఆడ్రియల్ బాబాకు పరిచయం చేసింది. ఈ సమయంలోనే బాబా అమెరికా నుండి చైనా వెళ్ళారు.

చైనా నుండి వస్తూనే హాలీవుడ్ నేలపై గత ఏడు సంవత్సరాల నుండి తాను పాటిస్తున్న మౌనం వదిలిపెడతానని బాబా ప్రకటించారు. ఈ రోజున ఈ మాటలు వింటుంటే నవ్వు రావచ్చు కానీ, మాకు ఆనాడు ముచ్చెమటలు పోశాయ్ అని, జీన్ ఆనాటి సంఘటన గుర్తు చేసుకుంటూ చెప్పింది. మెహెర్‌బాబా చైనా నుండి నేరుగా కాలిఫోర్నియాకు రావల్సి వుంది. ఐతే, బాబా ఆ పర్యటనను అకస్మాత్తుగా రద్దు చేశారు. దాంతో జీన్-స్కోలస్‌లకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. స్థానికంగా విచ్చేసిన వారందరూ హతాశులయ్యారు. దాంతో స్కోలస్ వారినందరినీ యూరోప్‌లోని కేన్స్ ప్రాంతంలో బాబా పర్యటనలో పాల్గొనమని ఆహ్వానించాడు.

జీన్ ఆడ్రియల్ అవతారుని నామస్మరణలో, నిరంతర ధ్యానంలో ఎక్కువగా గడిపింది. తద్వారా, అనేక ఆధ్యాత్మిక అనుభూతులు ఆమె చవి చూసింది.

ఆమెను, ఆమె భర్త మాల్కంలను బాబా నాసిక్ ఆశ్రమానికి ఆహ్వానించారు. జీన్ మితాహారం తీసుకునేది. ఎక్కువ సమయం ధ్యానంలో వుండేది. అందువల్ల ఆమె నీరసంగా, ఆరోగ్యం అంతంత మాత్రంగా వుండేది. ఆమె నాసిక్ ఆశ్రమంలో వుండే రోజుల్లో, ఇక్కడి ఎండ తీవ్రత వల్ల ఆమె మరింత నీరసంగా కనిపించేది. ఆమె ఎడల బాబా ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. ఒకసారి బాబా బృందంతో బుద్ధుని దేవాలయానికి వెళ్ళారు. అక్కడ వున్న ఎత్తైన మెట్లు ఎక్కడానికి జీన్ ఇబ్బంది పడుతుంటే, ఆమెను – 'డోలీ'లో మాదిరి ఆలయం దాకా ఎత్తుకుని తీసుకువచ్చి, తిరిగి, క్రింద దిగబెట్టమని బాబా తన మండలిని ఆదేశించారు.

ఆమె తరచు పళ్ళను ఆహారంగా తీసుకునేది. ఒకసారి ఆమె పుచ్చకాయ మాత్రమే ఆహారంగా తీసుకుంటోంది. నాసిక్‌లో వుండే రోజుల్లో ఆమెకు అవసరమైన పుచ్చకాయలు సక్రమంగా అందుతున్నాయో లేదోనని, అందుకు తగిన ఏర్పాట్లు బాబా స్వయంగా చేశారు. ఆ దరిమలా 1940వ దశకంలో నాసిక్ ఆశ్రమంలో




వున్న పాశ్చాత్య ప్రేమికులందర్నీ వారి దేశాలకు వెళ్ళి బాబా నామవ్యాప్తికై కృషి చేయమన్నారు. జీన్ ఆడ్రియల్ అమెరికాకు తిరిగి వెళ్ళాక, తనకిష్టమైన రచనా వ్యాసాంగం చేపట్టింది. మెహెర్‌బాబాతో తనకు గల అనుభవాలను **'అవతార్'** శీర్షికతో గ్రంధస్తం చేసి, 1947లో ప్రచురించింది. ఈ గ్రంథంలో జీన్ తన అనుభవాలను, ఆధ్యాత్మిక అనుభూతులను చక్కగా వివరించింది. ఐతే, అంతక్రితం 1937లో **"ది ఫర్‌ఫెక్ట్ మాస్టర్"** పేరుతో చార్లస్ పర్ధన్ అనే అమెరికాలోని బాబా ప్రేమికుడు అవతారుని జీవితచరిత్రను సంక్షిప్తంగా ప్రచురించాడు. జీన్ ఆండ్రియల్ రాసిన '**అవతార్** గ్రంధం' చక్కని సులభశైలిలో బాబా ప్రేమికులందరికీ తగిన సమాచారం అందజేస్తోందని, సాధారణ పాఠకుని మనస్సును కూడా హత్తుకునేలా వుందని పలువురి అభిప్రాయం. నాటి నుండి నేటి దాకా కొన్ని వందల వేల ప్రతులు అమ్ముడయిన ఈ గ్రంథం, అవతారుడు మెచ్చిన గ్రంధమని, ఒక ప్రామాణిక గ్రంధమని, బాబా ప్రేమికులు చాలామంది అభిప్రాయపడతారు.

ఈ గ్రంథంలో జీన్ ఆడ్రియన్ తన వ్యక్తిగత ఆధ్యాత్మిక అనుభూతులను అధికంగా వర్ణించిందని మరికొందరు అభిప్రాయపడతారు.

ఏదిఏమైనా, అవతారుడు స్వయంగా మెచ్చిన గ్రంధమిది.

వీలుచిక్కితే చదవవల్సింది.

ఇదిలావుంటే, జీన్ తరచు తనకు తెలిసిన పలువురు ఆధ్యాత్మిక గురువుల గురించి బాబా ఎదుట ప్రస్తావిస్తుండేది. అందుకు సమాధానంగా ఒక రోజున బాబా **'మాస్టర్, మాస్టర్! అయామ్ యువర్ గాడ్ అని ప్రకటించారు.**

1940 ప్రాంతంలో జీన్ అడ్రియల్, తన స్నేహితునితో కల్సి, కాలిపోర్నియాలోని 'ఒజై' ప్రాంతంలో **మెహెర్ మౌంట్** పేరుతో బాబా సెంటర్‌ను నెలకొల్పింది.

జీన్ రాసిన **'అవతార్'** గ్రంథం ద్వారా, మరి ఇతర పరిచయాలతో స్థానికులు చాలామంది **మెహెర్ మౌంట్‌కు** విచ్చేశారు.

అందమైన సువిశాల భూభాగంలో, సుమారు 180 ఎకరాల విస్తీర్ణంలో, చిన్న ఎత్తైన కొండపై మెహెర్ మౌంట్ బాబా కేంద్రం నిర్మించారు.

1956లో బాబా ఈ ప్రాంతాన్ని సందర్శించారు.
మెహెర్‌బాబా 1948లో నవజీవనం చేపట్టడానికి ముందు,
జీన్ ఆడ్రియల్, మరి కొంతమంది పాశ్చాత్య ప్రేమికులను
మెహెరాబాద్, మెహెరాజాద్‌లకు ప్రత్యేకంగా పిలిపించారు.
భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులవి.
అలాగే, దేశ విభజన జరిగి, అలజడులతో నిండిన సమయం.
ఇలాంటి సమయంలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి
పాశ్చాత్య బాబా ప్రేమికులు మెహెరాద్‌కు వచ్చినా,
గతంలో మాదిరి బాబా వారితో హుషారుగా లేరని, బహుశా ఆనాటి సామాజిక
పరిస్థితుల దృష్ట్యా బాబా తన ఆంతరంగిక ఆధ్యాత్మిక కార్యక్రమంలో
నిమగ్నమయ్యారని వారు అనుకున్నారు.
జీన్ ఆడ్రియల్ **అవతార్** గ్రంధం రాసే సమయంలో 'మెహెరా' గురించి ఆ పుస్తకంలో
రాసేందుకు బాబా అనుమతి కోరింది. అందుకు బాబా **'నో'** చెప్పారు.
కృష్ణావతారంలో కృష్ణుడికి 'రాధ' లాంటిది మెహెరా అని పలు సందర్భాలలో బాబా
చెప్పారు. ఐతే, **అవతార్** ముద్రణ పూర్తయ్యాక,
మెహెరా గురించి ఏమీ రాయలేదేమని జీన్‌కు బాబా కేబుల్ టెలిగ్రాం పంపారు.
ఈ సంఘటన జీన్‌ని కలవరపరిచింది. ఆమె మనస్సు నొచ్చుకుంది.
తాను కోరుకున్నది బాబా అంగీకరించలేదని మనస్తాపం చెందింది.
తత్‌ఫలితంగా అన్నట్లు ఆమె క్రమేణా బాబా నుండి,
బాబా పరివార్ నుండి కొంతకాలం సుదూరంగా వెళ్ళింది.
ఆ తర్వాత **కిర్‌పాల్ సింగ్** వంటి గురువుల ఆశ్రమాలకు వెళ్ళింది.
కిర్‌పాల్ సింగ్ ఐదవ భూమికలో వున్నాడని బాబా ప్రకటించారు.
ఐదవ భూమికలో వున్నవారు మహత్యాలు చేయగలరు.
ఎవరైనా, అలాంటి మహత్యాలకు ఆకర్షితులై, ఆ వలలో చిక్కుకోవడం పరిపాటి.
జీన్ బాబాను వదిలి వెళ్ళడం పట్ల అమెరికాలోని స్థానిక ప్రేమికులు కలత చెందారు.
ఇది కూడా 'బాబా ఇచ్ఛ' ప్రకారమే జరుగుతోంది అనుకున్నారు.
"తన వ్యతిరేకులు కూడా," నా కార్యక్రమం చేపడుతున్నట్లే అన్నారు బాబా.
బాబా 'మెహెరా'కిచ్చిన స్థానం, ఆ ప్రత్యేకత తన కివ్వకపోవడంతో తానెంతో
బాధపడ్డానని,కొందరి దగ్గర ఆమె చెప్పుకుంది.
దాంతో, జీన్ సుమారు 17 సంవత్సరాలు బాబా ప్రేమికులకు దూరంగా వెళ్ళిపోయింది.
ఆ సమయంలో బాబా ప్రేమికులకు ఆమె జాడ తెలియకుండా జాగ్రత్త పడింది.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను. కడదాకా నేను నీతోనే వుంటాను, అని బాబా ఒక సంధ్భంలో జీన్‌కు కేబుల్ పంపారు. బాబా పరిధిలోకి రావడం, రాలేకపోవడం, వచ్చి సుదూరంగా వెళ్ళడం, ఇదంతా అవతారుని లీల మాత్రమే. ఇదంతా అవతారుని ఇచ్ఛ ప్రకారమే జరుగుతుంది. బాబా పరిధిలోకి వచ్చినవారు తిరిగి ఎక్కడికెళతారు? ఈ ప్రపంచంలో అణువణువునా బాబా పరివ్యాప్తి చెందివున్నాడు.

అప్పుడప్పుడు వచ్చీపోయే దట్టమైన కారు మబ్బులు సూర్యుడ్ని కొద్దిసేపు కనబడకుండా చుట్టుముట్టినట్లు, దట్టమైన వ్యక్తిగత సంస్కారాలు, ఆ మేఘాల మాదిరి అడ్డుతగిలి అవతారుడి నుండి మనం దూరమైన ఆయన తన ప్రేమికుడ్ని విడిపోడు కదా!!

ఆ మాదిరిగానే, ఆ దరిమలా, 1975 ప్రాంతంలో బాబా ప్రేమికుల నడుమ జీన్ ఆడ్రియల్ తన తప్పు ఒప్పుకుంది. ఒక రోజున బాబా మాటలు వినడానికి కూడా ఇష్టపడని జీన్, తిరిగి సాధారణ స్థితికి వచ్చింది. బాబా కార్యక్రమాల్లో తిరిగి చురుకుగా పాల్గొనింది. ఆమె చివరిసారిగా 1952లో బాబా న్యూయార్క్ పర్యటనలో దర్శించుకుంది. 90 సంవత్సరాలు జీవించిన జీన్ తన శేషజీవితం అవతారుడి నామస్మరణలోనే గడిపింది. సహజ రచయిత్రిగా, మృధు భాషిగా సుపరిచితురాలైన జీన్ బాబా గురించి అనేక విశేషాలు, తన అనుభవాలు, అనుభూతులు స్థానిక ప్రేమిక జనావళితో పంచుకునేది. ఆమె రాసిన 'అవతార్' గ్రంథం, నేటికీ ఎందరో క్రొత్తవారిని మెహెర్‌బాబాకు పరిచయం చేస్తోంది.

1984 మే 16న అమెరికాలోని కాలిఫోర్నియాలో బాబా నామస్మరణలో జీన్ తుదిశ్వాస వదిలింది.

# గ్లో ఇంటర్‌నేషనల్

**పత్రిక సంపాదకులు నౌషెర్‌వాన్ అన్‌జార్**

1982 జూన్ 30న అమెరికాలోని Convalescent Hospital, California, USAలో జీన్ ఆడ్రియల్ వుండగా కలిసి ఇష్టాగోష్ఠి ముచ్చటించారు. ఆ సంభాషణ 1984 ఆగష్టు సంచికలో **WE WILL REMEMBER THEM** శీర్షికతో పేజి 38లో ప్రచురించారు. ఆ ఇంటర్వ్యూలో 'గ్లో' పత్రిక సంపాదకులు ఇలా వ్రాశారు. ఇకపై వారి మాటల్లోనే..

**ఎంతో** కాలంగా జీన్ ఆడ్రియల్‌ను కలుసుకోవాలన్న కోరిక ఇన్నాళ్ళకు తీరింది. బాబా ఫోటోలు-పత్రికలు కొన్నింటిని నాతోపాటు తీసుకెళ్ళి ఆమెకిచ్చాను. నన్ను చూడగానే ఎంతో ప్రేమతో ఆహ్వానించింది.

ఆమె ముఖంలో ఎంతో సంతోషం కనిపించింది.
తన చిన్ననాటి స్నేహితుడ్ని చూసినట్లు ఆప్యాయంగా నాకేసి చూసింది.
సమయం వృధా చేయకుండా ఆ వెనువెంటనే మెహెర్‌బాబా సంగతులు మాట్లాడటం ప్రారంభించాను. బాబాతో ఆమెకు గల ఎన్నో మధురమైన జ్ఞాపకాలు సంతోష సంభ్రమాశ్చర్యాల నడుమ చెప్పింది. కొన్ని సందర్భాలలో ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. మరోసారి కడుపుబ్బా నవ్వులతో చతురోక్తులతో చెప్పింది.
నిరంతరం బాబా సేవలో-ప్రేమలో తరించాలన్న ఆమె తపన నాకు కనిపించింది. ఆమె ముఖంలో బాబా ఎడల గల ప్రేమ కోటి సూర్యకాంతులతో వెలిగిపోతూ కనిపించింది. మెహెర్‌బాబా అమెరికా తొలిసారిగా 1931లో వెళ్ళినప్పుడు, జీన్ ఆడ్రియల్, ఆమె భర్త-బాబా బృందానికి ఆతిధ్యం ఇచ్చారు.
తిరిగి 1932లో, 1934లో, బాబాను దర్శించుకున్నారు.
1936లో పాశ్చాత్య బృందంతో కలిసి నాసిక్ ఆశ్రమంలో గడిపారు.
ఆ సమయంలో మెహెర్‌బాబా తన సర్కిల్లో-జీన్ ఆడ్రియల్‌ను **ది జీవల్** అని అభివర్ణించారు. 1937 జూలై చివరివారంలో బాబాతోపాటు జీన్ ఆడ్రియల్ దంపతులు మరికొందరు 'కేన్స్' నగరానికి వెళ్ళారు.
ఆ పర్యటనలో బాబా జీన్‌తో మాట్లాడుతూ,
నిన్ను నానుండి దూరంగా నెట్టేస్తాను.
తిరిగి నాకు అతి సన్నిహితంగా తీసుకుంటాను.
మరోసారి నిన్ను దూరంగా పంపివేసి,
మరింత దగ్గరగా తీసుకుంటాను.
ప్రస్తుతం, నిన్ను నా నుండి సుదూరంగా పంపివేస్తున్నానన్నారు.
ఆ తర్వాత, రాబోయే జన్మలో
నిన్ను నా దరిచేర్చుకుని, నా విశ్వాత్మలో కలుపుకుంటానని,
బాబా ప్రకటించారు.

At the end of July 1937, some of the Westerners, including Jean and Malcolm, sailed to Cannes. It was at the end of this stay that Baba said to Jean, ñI push you away, then I draw you close; again I push you off and draw you even closer; now I push you far away and the next time I draw you back to Me it will be to remain one with my Universal Self, forever,ò

నాసిక్ ఆశ్రమంలో వుండి అమెరికా వచ్చిన జీన్ క్రమేణా బాబా కార్యక్రమాలకు దూరమయ్యింది. అంతర్గతంగా ఎన్నో అనుభూతులు చవిచూసింది. ఆరోగ్యం పాడైంది.

ఏదో తెలియని వెలితి, తెలియని వ్యధ ఆమె అనుభవించిందని ఆమె మాటలతో నాకు అర్ధమయింది. అవి చీకటి రోజులని ఆమె నాతో అన్నది. బాబా నుండి దూరమౌతానని నేనెన్నడూ ఊహించ లేదు. బాబా ఎడల నాకెన్నడూ ఎలాంటి అనుమానం లేదు. ఏ కారణమో చెప్పలేను. మాటలు రావడం లేదు. ప్రస్తుతం ఆ రోజులన్నీ సమసి పోయాయి. ప్రస్తుతం బాబా కార్యక్రమాల్లో మునుపటిలా హుషారుగా పాల్గొనలేకపోతున్నానని, రోగాలతో ఆసుపత్రిలో మంచానికి అంటిపెట్టుకున్నానని చింతించింది. రోదించింది. అవసానకాలం దరిదాపుల్లోనే వుందని, ఏపనీ చేయలేక నిరుపయోగంగా వున్నానని బాధపడింది. అదే సమయంలో అంతా బాబా ఇచ్ఛ ప్రకారం జరుగుతోందన్నది. త్వరలో బాబాను చేరుకొంటున్నానని నాకు తెలుసు. బాబావారి దైవీ ప్రణాళిక ప్రకారం జరుగుతోందన్నది.

నిరంతరం బాబా సేవలో, ప్రేమలో విధేయులుగా భావించే నేటి తరం యువత అందరికీ బాబా సేవలో ప్రేమలో తరించిన జీన్ ఆడ్రియల్ ఆదర్శం. ప్రాతస్మరణీయురాలు. గ్లో పత్రిక సంపాదకులు జరిపిన ఈ ఇంటర్వ్యూ తర్వాత సుమారు రెండేళ్ళకు ఆమె బాబాలో ఐక్యమయింది. గ్లో పత్రిక ఆమెను కలవకుంటే, బాబాను విడిచి వెళ్ళి పోయిన జీన్‌గా ఆమె మిగిలి వుండేదేమో!!

# రచనలకు ఆహ్వానం

బాబా సందేశాలపై, మీకు నచ్చిన అంశాలపై మీ రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ ప్రాంతాల్లో జరిగే సహవాస్ కార్యక్రమ వివరాలను కూడా మా చిరునామాకు పంపండి. మీ సమాచారం మాకు ప్రతి నెలా 5వ తేదీ లోగా అందేలాగా పంపవల్సింది. **మా చిరునామా..**ఎడిటర్, బాబాస్ హౌస్, గోదావరి గార్డెన్స్, ప్లాట్ నంబరు 32, యాప్రాల్, సికింద్రాబాద్ - 500 087.
ఫోన్ 99595 53218. **ఇ-మెయిల్.** malladisukku@gmail.com.

# జీవిత సభ్యుల వివరాలు

చివరాఖరి పేజీలలో..36-37లలో జీవిత సభ్యుల వివరాలు ప్రచురించడమైనది.
**దీని ఉద్దేశ్యం** 1. సంబంధితులందరికీ వివరాలు తెలియజేయడం.
2. తప్పొప్పులు పొరబాటున దొర్లినట్లైతే సరిదిద్దుబాటు కోసం ప్రచురిస్తాం.
దయచేసి మీ పేర్లు సరిచూసుకోండి. ఫిర్యాదులుంటే దయచేసి తెలియజేయండి.

# జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు

**2002 –** మే 2014 వరకు, కృష్ణాజిల్లా

| | | | |
|---|---|---|---|
| 1 | Tadepally Sarojini, Vijayawada | Oct, 02 | 1000 |
| 2 | Durgaprasad M.Challapally | Aug, 03 | 1000 |
| 3 | Sanjeeva Rao. M , Machilipatnam | Apr, 04 | 1000 |
| 4 | Urimi Naga Venkata Praabhakar | Apr, 04 | 1000 |
| 5 | Vurimi Naga Venkata Prabhakarrao, Challap | Nov, 04 | 1000 |
| 6 | Tadepally Hanumantha Rao, Vijayawada | Jan, 05 | 1000 |
| 7 | Subramanyam. K | Feb, 06 | 1000 |
| 8 | Gunda L.V.Subbamma | May, 06 | 1000 |
| 9 | M. Padmavathi | Sept, 06 | 1000 |
| 10 | M.Meher Gopi | Nov, 06 | 1000 |
| 11 | Talupula Subba Rao, Masula | Jan, 07 | 1000 |
| 12 | Meher Sri Rice Traders, Challapalli | Jan, 07 | 1000 |
| 13 | R. Simhachalarm, Perikepadu Bridge | Mar, 07 | 1000 |
| 14 | A.S.S.V.Prasad, Vuyyuruó | Feb, 09 | 1000 |
| 15 | Dr. E.A.S. Prabhakar, Vijayawada | Nov, 10 | 1000 |
| 16 | Talla Nageswarao, Pedana | May, 11 | 1000 |
| 17 | Divvela Venkata Subba Rao, Vijaywada | June, 11 | 1000 |
| 18 | D. Umadevi, vijayavada | Feb, 12 | 1000 |
| 19 | Chanduru Mehervenkata R. satyavaraprasad | July, 02 | 1000 |
| 20 | Bala Seetha Devi . Bh., Vijayawada | Nov, 04 | 1000 |
| 21 | Chunduri Nageswararao, Challapalli | Feb, 05 | 1000 |
| 22 | Kolla Subramanyeswara Rao, Bantumalli | Feb.08 | 1000 |
| 23 | P. Meher Kumar, Vijayawada | Feb.08 | 1000 |
| 24 | M.S.Mani, Machilipatnam | May, 08 | 1000 |
| 25 | Avatar Meher Baba Center, VUYUUR. | June, 08 | 1000 |
| 26 | Linga Meher Babajee, Vijayawada | Dec. 08 | 1000 |
| 27 | K.V. Durga Prasad C/o K.Lalitha, Vijayawad | Dec. 08 | 1000 |
| 28 | M.V.V.SubbaRao | Jan,09 | 1000 |
| 29 | Chakka Venkata Panduranga Vittal, Challap | Jan,09 | 1000 |
| 30 | Patri Adarsha Meher, Challapally | Oct, 11 | 1000 |
| 31 | K. Chnandra Joshna | July, 10 | 1000 |
| 32 | Avatar Meher Baba Center | Sep, 10 | 1000 |
| 33 | Murali Krishna, Vijayawada | Nov - 13 | 1000 |

## జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు

**2002 – మే 2014 వరకు, కృష్ణాజిల్లా**

| | | | |
|---|---|---|---|
| 34 | Anumolu Lakshmi Prakash, Vijayawada | Feb, 09 | 500 |
| | Anumolu Lakshmi Prakash, Vijayawada | Nov. 09 | 500 |
| 35 | Badam Lakshman | Feb, 05 | 500 |
| | Badam Laxman Kumar, Vijayawada | Feb, 09 | 500 |
| 36 | Chalasani Padmavathi | April. 08 | 500 |
| | Chalasani Padmavathi, Challapally | April, 09 | 500 |
| 37 | Dr.KeshavaRao .B. Vijayawada | Jun, 05 | 500 |
| | Dr.Kesavarao B Vijayawada | Jun, 04 | 500 |
| 38 | K. Prabhakar Murthy , Vijayawada | Feb. 11 | 500 |
| | K. Prabhakar Murthy , Vijayawada | Feb, 12 | 500 |
| 39 | Meher Kumar, Vijayawada | Oct, 10 | 600 |
| | Meher kumar, Vijayawada | Apr, 04 | 400 |
| 40 | Raghavarapu Ganapathi Rao | Mar, 06 | 500 |
| | Raghavarapu Ganapathi Rao, Vijayawada | Feb.08 | 500 |
| 41 | Koganti Ramesh | Sept, 06 | 500 |
| | Ramesh .K | Nov, 05 | 500 |
| 42 | G.Venugopal,Vijayawada | Dec. 08 | 500 |
| | Venu Gopal , Vijayawada | Aug, 05 | 500 |
| 43 | Meherji G. Vijayawada | Dec, 03 | 500 |
| | Meherji, vijayawada | July, 13 | 500 |

## జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు

**2002 – మే 2014 వరకు, కృష్ణాజిల్లా**

| | | | |
|---|---|---|---|
| 1 | Yogeshwar Rao.V | July, 05 | 500 |
| 2 | Metla Kota Venkata Subba Rao, Challapalli | June, 08 | 500 |
| 3 | Gudimetla Sreenu, Vijayawada | July, 07 | 400 |
| 4 | Gupta KVB , Vijayawada | Sep, 04 | 500 |
| 5 | Dr. Subrmanyam, Vijayawada | Sep, 10 | 500 |

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2015 అక్టోబర్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | అక్టోబర్ | యస్. రామారావు, నిడదవోలు, ప.గో.జి. | రూ. 900.00 |
| 2. | అక్టోబర్ | కోక శ్రీనివాస్, కొవ్వూరు, ప.గో.జి. | రూ. 1000.00 |
| 3. | అక్టోబర్ | శ్యామల, కేరాఫ్ రామారావ్, హైదరాబాద్ | రూ.1000.00 |
| 4. | అక్టోబర్ | చక్కా హరనాథ్, విజయవాడ | రూ. 1000.00 |
| 5. | అక్టోబర్ | డి.వి. సుబ్బారావు, విజయవాడ | రూ. 1000.00 |

# మెహెర్‌బాబా పత్రిక

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-.** ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB-SLVRI A/C NO: 17320 10000 29152**
**IFSC CODE: IOBA 0001732.**

**వార్షిక సభ్యత్వం కోరువారు, రూ.100/- ఆన్‌లైన్‌లో పంపగోరువారు,**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB-SLVRI A/C NO: 17320 10000 27973,**
**IFSC CODE: IOBA 0001732.**

**మా అడ్రస్:** ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,
బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087. ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month, Posted at Patrika Channel on 19 / 20th every month.